

# బాల వికాసం

**సిద్దిపేట జిల్లాలోని వర్గల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు రాసిన కవితలు ఈవారం...**

## నెహ్రూ

పండిత్ జవహార్ లాల్ నెహ్రూ
నువ్వే మా చాచావి
మా మనసులో చెరగని రూపానివి
నీ ఎదపై ఎర్రని గులాబి
ఆడిస్తుంది
పాడిస్తుంది
నవ్విస్తుంది
అవి చూచి మురుస్తుంది
నీ చిరునవ్వు పిల్లలకు అంకితం
నీ మార్గంలో బాగుపడుతుంది జీవితం.



-ఉ సౌమ్య
9 వ తరగతి
జి ప ఉ పా వర్గల్

## అమ్మ

జన్మను ఇచ్చేది అమ్మ
ప్రాణం పోసేది అమ్మ
ఆకలి తీర్చేది అమ్మ
ధైర్యం చెప్పేది అమ్మ
ఓదార్చేది అమ్మ
ప్రేమను పంచేది అమ్మ
బాగుండాలని కోరుకునేది అమ్మ
అలాంటి అమ్మ మనతో నడిచేది అమ్మ.



-యల్ గౌతమ్
10వ తరగతి
జి ప ఉ పా వర్గల్
సిద్ధిపేట జిల్లా

## తెలుసుకో...

విలన్ గొప్ప వాడైతే
హీరోయిజం ఎలివేట్ అవుతుంది ...
పోటీలో పాల్గొనే వాళ్ళు
ఎంత ఎక్కువ మంది ఉంటే....
ప్రథమ స్థానాన్ని పొందిన వాడి విలువ
అంత ఎక్కువ అవుతుంది....
నేనొక్కడినే ఆడాను...
నేనొక్కడినే గెలిచాను ....
అనడంలో అర్థం ఏముంటుంది....
పోటీదారుని పుట్టనివ్వాలి...
ఎదిగే అవకాశం ఇవ్వాలి....
వాడిపై నెగ్గాలి...
అప్పుడే కదా గెలుపుకు అర్థం....
ఎదురుపడే వాడే లేనప్పుడు....
మన బలం.... మన బలహీనతలెలా తెలుస్తాయి...
కనీసం మన తప్పులను తోసి వేయడానికైనా
శత్రువర్గం కావాలి....
అందుకే పొగిడేవారే కాదు..
తెగిడేవారూ అవసరమే...,
వైరివర్గమే మనలను ఎల్లప్పుడూ
అలర్ట్ గా ఉండేలా చేస్తుంది...
సముద్రపు అలను ఆపినప్పుడే కొండకు విలువ....
కొండను ఢీ కొట్టినప్పుడే అలకువిలువ...




- అరాశ అమరవాది
రాజశేఖర శర్మ
తెలుగు భాషోపాధ్యాయులు
జి ప ఉ పా వర్గల్



## పాఠశాల

మా మంచి పాఠశాల
మము మార్చే ప్రయోగశాల
ఉన్నత విద్య తో
అన్ని వసతులతో
మంచి నడవడిక నేర్పిస్తుంది
క్రమశిక్షణను అలవరుస్తుంది
మాకు నేర్పుతుంది చదువు
మా బ్రతుకు పెంచుతుంది పరువు
చదువు లేకుంటే తప్పదు కరువు
మన గతినే మార్చే తరగతి గదులు
చెడు పనులను నివారించే గురువులు
చక్కని మార్గం లో విద్యార్థుల జీవితం
చిక్కటి పునాదులతో నిలిచే
సౌందర్య భవనం అవుతుంది.



- పిట్ల లావణ్య
9వ తరగతి
జి ప ఉ పా వర్గల్

## అనుబంధం

ఎంతో కష్టం
మావూరి అందాలను
మాటల్లో చెప్పాలన్నా
కాగితంపై రాయాలన్నా....

ఇక్కడ అందరికీ ఆరోగ్యం
ఇక్కడ అందరికీ ఆనందం
ఎంతో శాంతి
ఊరికదే కాంతి

ఈ వూరికి నాకూ విడదీయరాని బంధం
ఇది జన్మజన్మల అనుబంధం.



-యల్ .భవాని
9వ తరగతి
జి ప ఉ పా వర్గల్
సిద్ధిపేట జిల్లా

## అందం

భూమికి ప్రకృతి అందం
ఆకాశానికి జాబిలి అందం
బడికి పిల్లలందం
పిల్లలకు చదువులందం
మనిషికి మనసందం
పూజకు పువ్వు అందం
దేశానికి మేమే అందం



-రేణుక
10వ తరగతి
జి ప ఉ పా వర్గల్
సిద్ధిపేట జిలా

## చెట్లు

చెట్లు
మనకు జీవనాధారం
మనకు నీడనిస్తాయి
రోగాలకు ఔషధాలౌతాయి
కాలుష్యాన్ని నివారిస్తాయి
చెట్లను నాటాలి
చెట్లను పెంచాలి
జీవితాశయం కావాలి



-పి నవ్య
9వ తరగతి , జిపఉపా
వర్గల్ సిద్ధిపేట జిల్లా

## పల్లె

అందమైన మా పల్లె
అందాల ప్రకృతి ముల్లె
పచ్చని చెట్లు
పంట పొలాలు
చల్లని గాలి
స్వచ్ఛమైన నీరు
ఆప్యాయతలు
అనురాగాలు
తిరిగె పక్షులు
పెరిగే పశువులు
పండుగలు
పసుపుబొట్లు
కళకళ లాడుతు
హాయిని గూర్చే
సిరిసంపదల మా పల్లె
మంచి మమతల ముల్లె



- పి స్రవంతి
10 వ తరగతి
జి ప ఉ పా వర్గల్
సిద్ధిపేట జిల్లా


## గొర్రెలంటే మాకు ప్రాణం

గొర్రెలంటే మాకు ప్రాణం
గొర్రెలే మా జీవనాధారం
ఒకటి రెండై...
రెండు నాలుగై...
మా ఆదాయాన్ని పెంచుతాయి
మాకు ఆనందాన్ని పంచుతాయి
ఆహారంగా మారుతాయి
ఉన్ని చలినుండి కాపాడుతుంది
ఆకులు తింటూనే
చక్కని ఎరువులనిస్తుంది
మా మంద పెరుగుతుంటే
పిల్లాపాపలు ఆనందిస్తారు
అవే మా ఆస్తి.




- పి. రమేశ్
7వ తరగతి
జిపఉపా వర్గల్
సిద్ధిపేట జిల్లా







## పుస్తక సమీక్షలు



# మరో అపురూప గ్రంథం "తగిన శాస్తి"

దండ్రె రాజమౌళి రచించిన పిల్లల కథలు "తగిన శాస్తి" ఒక్కోకథా ఎంతో సరదాగా సాగింది. బాలల రచయితలు అరుదైన ఈ కాలంలో ఈ పుస్తకం నిలబడుతుందేమో అనిపించేలా ఉంది. ఎందుకంటే ఏదో వృధాగా రాయటమే కాదు..పిల్లలనే కాదు పెద్దలను కూడా మెప్పించేదిగా ఉంది. రాజమౌళి సాహిత్యాబిలాషి, కవిత్వం రాయడమే కాకుండా సామాజిక కథలు, బాలల కథలు కూడా రచించారు,.. వృత్తిరీత్యా ఉపాధ్యాయుడైన వీరు అనేక రచనలు చేసారు. అవార్డులు కూడా అందుకున్నారు. తెలంగాణ ప్రభుత్వ నగదు పురస్కారం ఉత్తమ సాహితీవేత్తగా గుర్తింపు పొందారు. బతుకమ్మ పురస్కారం, కృషి కవితా పురస్కారం( 2017) పొందారు. వీరు రచించిన గ్రంథాలు ఏవీ నేను చదవలేదు కానీ ఈ బాలసాహిత్యం పేరిట రచించిన కథలు మాత్రం ఎంతో కొత్తగా ఉన్నాయి. వీరి కథల్లో ఎత్తుగడ, ముగింపు ఎంతో ఆసక్తికరంగా ఉంది. ప్రతి కథలో నీతిని బోధిస్తూ ముగింపులో చమక్కులతో ముగించడం, పాఠకులు ఊహించని రీతిలో ముగించడం ఈ గ్రంథం ప్రత్యేకత.

పిల్లి, పిల్లి కొట్లాడితే కోతి లాభపడినట్లు సాగిన కథ "మొదటికే మోసం", తోటివారికి కష్టం కలిగిస్తే ఎదురయ్యే పరిణామాల్ని బోధించే రీతిలో సాగిన కథ "తనదాకా వస్తే" చెడు చేయాలనుకునే వారికి చివరికి ఏమవుతుంది అని తెలిపే కథ 'నక్క తపస్సు', నిత్యం మనకు శత్రువులే ఎదురవుతున్నా ఎలా ఎదుర్కోవాలో అని తెలిపే కథ "అడుగడుగునా శత్రువులే' దురాశకు పోతే ఎలా జరుగుతుందని తెలిపే కథ "దురాశకు పోతే" అలాగే..భూతదయ, తిండిపోతు, మోసపోయిన సింహం, బుద్ధిబలం, భూతదయ, రెంటికీ చెడ్డ రేవడు; గాలిలో ఎగిరే మంత్రం, తృప్తి, తల్లిఆరాటం కథలన్నీ దేని ప్రత్యేకతను అవే చాటుకున్నాయి. పిల్లల కోసం నీతికథలే రాయాలనుకున్నపుడు వస్తువు వారికి తెలిసిందే అవ్వాలి కనుక పాత్రలు, సంఘటనలు వారి పరిసరాలను దాటకుండా ఎంతో జాగ్రత్తగా రచించిన తీరుకు ఈ రచయితను ఖచ్చితంగా అభినందించాల్సిందే. అపుడే ఆ కథలు పిల్లల్ని చదివించేలా చేస్తాయి. తద్వారా సమాజంలో ఉన్నతమైన వ్యక్తులుగా ఎదగడానికి దోహదం అవుతుంది. ఇలా ఉత్తమ గ్రంథ పఠనం చేసినవారే నేడు సంఘంలో విశిష్ట వ్యక్తులుగా తీర్చిదిద్దబడుతున్నారు అనడంలో అతిశయోక్తి లేదు. ఆంగ్లంలో ఒక మాట ఉంది "రీడర్స్ ఆర్ లీడర్స్" అని. చదవడం అలవాటున్నవారే ఉన్నతమైన వారుగా, అధికారులుగా, నాయకత్వ లక్షణాలను కలిగి ఉంటారనేది నిజం.

దండ్రె చంద్రమౌళి వారు రచించిన నీతి కథలను కేవలం బాలల కోసమే ఈ పుస్తకంలో రాసారు. ఉపాధ్యాయుడు అవ్వటంతో వారి ఆలోచనలకు, వారి ఆశయాలకు అనుగుణంగా రచించారనడంలో అతిశయోక్తి లేదు.

ప్రతులకు: దండ్రె చంద్రమౌళి,
ఫోన్: 7702649820 వెల: 80/-

# అపురూపమైన గ్రంథం "చిన్నారి కథలు"





లక్కోజు రాజా గణేష్ రచించిన చిన్నారి కథలు ఎంతో సరదాగా సాగాయి. బాలసాహిత్యం కనుమరుగు అవుతోందా? అనిపించే ఈ కాలంలో అక్కడక్కడా ఇలాంటి గ్రంథాలు దర్శనమిచ్చి మనసుకు ఊరటను కలిగిస్తుంటాయి. ఈ సంపుటిలో 42 కథలున్నాయి. ప్రతి ఒక్క కథా బాలలను చదివితే లేదా చదివిస్తే లేదా చదివి వినిపించగలిగితే ఎంతో ఆలోచింపజేసేవిగా ఉన్నాయి. నేను అనేక సార్లు మీకు తెలిపే విషయం ఒక్కటే బాలలకు ఒక కథను వినిపించాలన్నా, రచించాలన్నా మనం ఎదగాలి. వారి స్థాయిలోకి ఆలోచించగలగాలి. స్వచ్ఛమైన ఆ హృదయాల్లోకి నింపే ప్రతి వాక్యం రేపు మనకు ఉత్తమ పౌరుడుగా తీర్చిదిద్దబడి ఎదురవుతుంది. ప్రాణం నిలిపిన కథ కష్టాలలో ఉన్నవారికి సాటివారు ఎలా సాయపడాలి అని తెలియజేసే కథ. జ్ఞాన సంపదకు మించిన ఆస్తిలేదని చాటి చెప్పే రావిఆకు చెప్పిన కథ, పెద్దల మాటలు వింటే ఎంత అద్భుతమైన జీవితం వస్తుందని తెలియజెప్పే కథ "బంగారు మాట", నమ్మకాన్ని పెంచే నెమలీక చెప్పిన కథ, ఐకమత్యాన్ని తెలియజెప్పే 'జంతువుల ఐకమత్యం' ఏది అవసరమో తెలియజెప్పిన 'వసుదైక కుటుంబం. ఓటమి, గెలుపు సర్వసాధారణములు అని తెలియజెప్పే కథ గెలుపు ఓటములు, దైవంపై ఉండాల్సిన భక్తి తత్వ ఆంతర్యం తెలిపే కథ "దైవభక్తి సాఫల్యం" ఆదుకున్న స్నేహితుడు, శాంతమతి సాహసం, దొంగల్లో దొర, కష్టేఫలి, నూదకొండమ్మ గుడి, నీటిమీద రాతలు, రామూ,శ్యామూల స్నేహం, రాణి ఈగ చెప్పిన కథ వంటి అనేక కథలు భావి భారత పౌరులకు, బాలలకు ఎంతో ఉపయోగకరంగా ఈ రచయిత రూపుదిద్దారు.

లక్కోజు రాజా గణేశ్ 1971లో యువజగతిలో పుట్టినరోజు కథానిక తో వీరి రచనా వ్యాసంగం ప్రారంభమై అప్పట్నించి వివిధ పత్రికలలో వీరి కథలు ప్రచురించబడి చాలాకాలం విరామం తర్వాత 2014వ సంవత్సరంలో ప్రారంభించి 120 కవితలు, 30 బాలల కథల ద్వారా వివిధ పత్రికలలో ప్రచురింపబడి అందరికీ చిరపరిచితుడయ్యారు. బాలగేయాలు 130 దాకా రచించారు. శతక పద్యాలు 150, జ్వలితాస్త్రాలు కవితా సంపుటి, చిన్నారి నేస్తాలు, హేమాలు( నీతి పద్యాలు) పుస్తకాలుగా ప్రచురించబడ్డాయి. వీరు రచించిన "కౌగిట్లో భూగోళం" కవితకు ఆంధ్ర సారస్వత సమితి వారు అభినందించి సత్కరించడం జరిగింది.

బాలసాహిత్యం ఎపుడూ ఎదిగిన వారివే మన్నన పొందుతాయనడం వీరి విషయం ద్వారా మరోసారి రుజువయ్యింది. తెలుగు సాహిత్యాన్ని రాబోయే తరాలకు పసితనం నుండి అలవాటు చేయడం అంటే ఇలాంటి గ్రంథాలను ఇంట్లో దాచుకోవడమే పరిహారం. ఇంట్లో ఉంటే హృదయాల్లో ఉన్నట్లే కదా? కొని దాచుకోవడమే ఆలస్యం..

ప్రతులకు: రాజా గణేశ్
ఫోన్: 9247483700
వెల: 45/-



సమీక్షకులు
-శైలజామిత్ర
9290900879

# బాలల జగత్తులో పయనించాలి...

ఆబాల గోపాలాన్ని ఆటపాటలతో ఆనందపరిచి, అలరింపజేసింది బాల్యం. బాలలు పరబ్రహ్మ స్వరూపులు, ప్రకృతిలోని ప్రతి వస్తువు తనదేనంటూ మురిసిపోయే నగధీరులు. అట్టి బాలల కోసం మనం ఎంత చేసినా తక్కువే. బాలల వికాసం కొరకు బాల్యంలోకి అడుగులు వేసి ఆడాలి, పాడాలి, పరవశించాలి అప్పుడే బాలల లోకంలోకి చేరుతాము. అట్టి బాల మేధావుల అడుగులు గమ్యం వైపు పయనించేందుకు ఎందరో బాల సాహితీవేత్తలు కలాలు కదిలించి కథలు గేయాలు జీవిత చరిత్రలు వ్యాసాలు పలురూపాలలో బాలల చెంత చేరి భవిష్యత్తుకు మార్గం చూపిస్తున్నారు.

నేడు తెలంగాణలో బాల సాహిత్య వికాసం కొరకై పుస్తకాలుగా అందించడమే కాకుండా, బాలలచే రచనలు చేయించేందుకు కార్యశాల సైతం ఏర్పాటు చేసి బాల కవులను సైతం తయారు చేస్తూ చిన్ననాడే సాహితీ బీజాలు నాటుతున్నారు. నేడు బాలసాహిత్యంలో రూపురేఖలే మారిపోయాయి. వాస్తవానికి బాలసాహిత్య రచన చేయాలంటే బాలల స్థాయికి దిగి ఆలోచించాలి, బాలల మనస్తత్వం అలవర్చుకోవడం కష్టమే. చెయ్యి తిరిగిన రచయితలు సైతం అమ్మో! బాల సాహిత్యమా అంటూ అడుగులను ముందుకువెయ్యక బాలసాహిత్య రచయితగా చెప్పుకోవాలంటే ఊగిసలాడేవారు. కాని నేడు బాలసాహిత్యానికి చక్కని ఆదరణ లభిస్తుండడంతో పరిస్థితులు మారిపోయి మేము మొదలుపెట్టింది బాలసాహిత్యంలోనే, ప్రస్తుతం కూడా మేము వ్రాయగలము అంటూ, కలాలను కదిలించి ఎందరో సాహితీవేత్తలు రచనా పరిమళాలతో బాలసాహితీ లోకంలో విహరిస్తున్నారు. ఇలాంటి కల్మషంలేని బాల మకరందాలు చిన్ననాడే విశాల జగతిలో లక్ష్యం వైపు పయనించేందుకు మార్గదర్శక వీచికలే బాలసాహిత్యం. అవధులు లేని ఆనందంతో మంచిచెడులు,కష్టసుఖాలు బేరీజు వెయ్యని బాల్యాన్ని ముందుకు నడిపించే బాధ్యత బాలసాహిత్యానిదే.

బాలలకు మంచి,నీతిని అందించేలా చిట్టి పొట్టి మాటలతో, ఆకర్షణీయమైన బొమ్మలతో రచనామృతాన్ని అందించేది బాలసాహిత్యం.అట్టి బాలసాహిత్య రచనలు చేస్తూ బాలల చేతికి పుస్తకాన్ని అందించి, మానసిక వికాసానికి తోడ్పడి బాలల విజయాలకు వారధులు,సారథులు అవుతున్నా బాలసాహితీవేత్తలు ఎందరో మన తెలంగాణలో కలరు. డాక్టర్ భూపాల్ రెడ్డి,టి.వేదాంత సూరి, వాసాల నరసయ్య, డాక్టర్ పత్తిపాక మోహన్, పైడిమర్రి రామకృష్ణ, డాక్టర్ అమ్మిన శ్రీనివాసరాజు, పుప్పాల కృష్ణమూర్తి, ఐతా చంద్రయ్య, వడ్డేపల్లి కృష్ణ, ఆర్ శర్మ, గరిపల్లి అశోక్, ఎన్నవెల్లి రాజ మౌళి, డాక్టర్ వాసరవేని పర్శరాములు, పెందోట వెంకటేశ్వర్లు, డాక్టర్ సిరి,కందేపి రాణిప్రసాద్,ఎడ్ల లక్ష్మి, వడ్డేపల్లి సంధ్య,కోణం పర్శరాములు, వరుకోలు లక్ష్మయ్య, వురిమండ్ల సునంద, గుళ్ళపల్లి తిరుమల క్రాంతి కృష్ణ,మంగళంపల్లి రామచంద్రమూర్తి, వడ్డేపల్లి వెంకటేష్, సమ్మెట ఉమాదేవి,సరిత నరేష్, గిర్నిఅంజా గౌడ్, వాసాల వెంకటేశ్వర్లు, గంగాపురం శ్రీనివాస్, బస్వ రాజ్ కుమార్ తదితరులు బాల సాహిత్యంలో రచనలు చేస్తూ పుస్తకాల ద్వారా బాలల జగతికి రచనామృతాన్ని అందిస్తున్నారు.అంతేకాకుండా అనేక సాహితీ సంస్థలు సైతం నేడు బాలసాహిత్యానికి పెద్ద పేట వేస్తుండడం సంతోషదాయకం. ప్రతి జిల్లాలలో చాలా పాఠశాలల్లో విద్యార్థుల చేత రచనలు చేయించి పుస్తకాలు ముద్రించి, బాల కవులను తయారుచేస్తున్న ఉపాధ్యాయులకు శతధా వందనాలు. ఒక వ్యక్తి కవిగా మారితే మంచిని పంచుతాడని, సమాజాన్ని చైతన్య పరిచి ప్రగతి వైపు మళ్లిస్తారని అంటాం. అలాంటి సందర్భంలో చిన్ననాడే సాహితీ రచనలతో బాల కవులుగా సమాజ సేవ చేయాలని, జగతిని జాగృత పరచాలని, బాలకవులు ముందుకు నడిస్తే భవిష్యత్ అంతా బంగారుమయం. ఆ శక్తి బాల సాహిత్యానికి ఉన్నది. అందుకే విరివిగా బాల సాహిత్య కార్యక్రమాలు కవి సమ్మేళనాలతో పాటుగా బాలోత్సవాలు జరగాలి. బాలసాహిత్యం వర్ధిల్లాలి.



-ఉండ్రాళ్ళ రాజేశం
9966946084

నేటినిజం
# సాహితీ కెరటాలు
E-mail : netinijam93@gmail.com website: www.netinijam.com
గురువారం 5-12-2019 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 హైదరాబాద్ 3

**నమ్మలేని నిజాలు**

దారి మారింది
రొక్కముంటేనే పీఠం
ధరల పోటు.

డ్రామాలో డ్రామ
సిద్ధాంతాలకు నీళ్ల
తినేత్ర తంత్రం.

కుర్చీ విలాపం
గాడిదల్ని మోస్తున్నా
సింహాలు లేవు.

జనం యాతన
ఉల్లి ఉడుకుమీద
నోటి కందదు.

స్త్రీలపై హింస
మాటల తీపి పొట్లం
మారని దిశ.



– రేడియమ్
9291527757

**శ్రీనిజాలు**

జస్టిస్ ఫర్ దిశా హత్య
దేశానికి చేటు !
కోర్టు తీరు తీర్పు ఉరే
సరియైనది వేటు !

ఆర్టీసీ కార్మికులకు
మొక్కు కున్నావరాలూ!
కేసీఆర్ రాజ ముద్ర
గుర్తుండును తరతరాలు!



– కందుకూరి శ్రీరాములు
సెల్:9440119245


# పవిత్రమైంది.. భార్యాభర్తల బంధం



తేట ఆర్ట్ క్రియేషన్స్ త్యాగరాయ గానసభ సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం (27.11.19)న ప్రముఖ కవి ఆచార్య కడారు వీరారెడ్డి రచించిన 'భార్యాభర్తల బంధం ..ఇగిరిపోని గంధం' ఆవిష్కరణలో డా॥ పోరెడ్డి రంగయ్య, డా॥ వసంత, రచయిత కడారు వీరారెడ్డి, ఆవిష్కర్త డా॥ కె.వి. రమణాచారి, ఆచార్య మసన చెన్నప్ప, బైస దేవదాసు, దాస్యం సేనాధిపతి

భార్యాభర్తల బంధం.. ఇగిరిపోని గంధం దీర్ఘ కవిత ఉదాత్త కవిత్వం ఉందని, అది భార్యాభర్తల అనుబంధం చుట్టూ ఆవరించుకొని ఉందని, సున్నిత హృదయుడైన పురుషుడు, సుకుమార మనస్విని అయిన స్త్రీమధ్య దాంపత్య జీవితంలో పంచుకున్న ప్రణయ రుచుల పారవశ్యం ఈ కవిత్వమని పలువురు వక్తలు పేర్కొన్నారు. తేజ ఆర్ట్ క్రియేషన్స్ త్యాగరాయ గానసభ సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం కళాలలిత కళావేదికలో ప్రముఖ కవి ఆచార్య కడారు వీరారెడ్డి రచించిన భార్యాభర్తల బంధం ..ఇగిరిపోని గంధం దీర్ఘ కవిత ఆవిష్కరణ సభను నిర్వహించారు. ఈ సభలో పాల్గొన్న అతిథులు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు డా॥కేవీ రమణాచారి, ప్రముఖ కవులు ఆచార్య మసన చెన్నప్ప, దాస్యం సేనాధిపతి, బైస దేవదాసు. వీరంతా కలిసి "భార్యాభర్తల బంధం..–ఇగిరిపోని గంధం" దీర్ఘ కవితను ఆవిష్కరించారు. అనంతరం అతిథులు మాట్లాడుతూ దీర్ఘ కవితలు సృష్టించడం అంత సులభం కాదని,, మొదట్నుంచి చివరి దాకా పేజీల కొద్దీ సాగే విషయం, సాంద్రమై, రసార్ద్రమై, హృద్యమై పదాల పోహలింపుతో ఇంపైసౌరు వెదజల్లాలని అన్నారు. ఈ కవితా సంపుటిని కొత్త వివాహం అయిన జంటలకు ఒక కానుకగా బహుకరిస్తే బాగుంటుందని వారు అభిప్రాయపడ్డారు. వీరారెడ్డి కవిత్వంలో మనిషి హృదయ ప్రక్షాళన సమర్ధంగా ఉందని అభివ్యక్తి అత్యంత రమణీయంగా ఉందని, భారతదేశ సంప్రదాయంలో భార్యభర్తల బంధం చాలా పవిత్రమైనందని వక్తలు వ్యాఖ్యానించారు. తాను రచించిన ఈ దీర్ఘ కవిత గురించి కవి వీరారెడ్డి వివరంగా మాట్లాడారు.

తేజ ఆర్ట్స్ క్రియేషన్స్ సంస్థ అధ్యక్షుడు, ప్రముఖ కవి, వక్త డాక్టర్ పోరెడ్డి రంగయ్య సభకు స్వాగతం పలికారు. సభలో పాల్గొన్న అతిథులను నిర్వాహకులు సత్కరించారు. ఈ సందర్భంగా డా॥ దేశికన్–శ్రీమతి కళ్యాణి, డా॥కె.వి. రమణ –శ్రీమతి లత, శ్రీ దాస్యం సేనాధిపతి–శ్రీమతి గీత, శ్రీ బైస దేవదాసు– శ్రీమతి వీణ, డా॥ భగవాన్‌రెడ్డి–శ్రీమతి హేమ, శ్రీ రఘువరామ్–శ్రీమతి మీరా, శ్రీ రాజా రావు–శ్రీమతి కమల దంపతులను ఆచార్య కడారు వీరారెడ్డి–శ్రీమతి వసంతలు సత్కరించారు.



ఆచార్య వీరారెడ్డి దంపతులకు సత్కరిస్తున్న అతిథులు

**గ్రంథావిష్కరణ సందర్భంగా దంపతులకు సత్కారం**



డా॥కె.వి. రమణాచారి దంపతులు



దాస్యం సేనాధిపతి దంపతులు



డా॥ దేశికన్ దంపతులు



రాఘవరాం దంపతులు




బైస దేవదాసు దంపతులు




రాజారావు దంపతులు



డా॥ భగవాన్‌రెడ్డి దంపతులు.



# వెలుగులు కురిపిస్తున్న బొజ్జాతారకం నీలిజెండా సంపాదకీయాలు



ఒక పత్రికకు కొన్ని నిబంధనలుంటాయి. అలాగే మీడియాకి కొన్ని నిబంధనలుంటాయి. పత్రిక అనేది ఏ అధికార పక్షానికి చెంది వుండకూడదు. అలాగే ఏ ఒక వ్యక్తికి గానీ, ఒక సమూహానికి గానీ సంబంధించి ఉండకూడదు. అని అంటారే కానీ ఎవరూ పాటించరు. అలాగే వ్యవస్థ ప్రజాస్వామికమే అంటున్నారు కానీ ప్రజల స్వామ్యం ఎక్కడా నేడు కనిపించడం లేదు. ఒక్కసారి ఓటు వేయడంతో ఓటు వేసినవాడు బతికినా, చచ్చినా మళ్ళీ ఎన్నికలొచ్చేదాకా పట్టించుకునేవారు ఉండరు. అది తెలిసినా ప్రజలు తిరగబడరు. ప్రశ్నించరు. అన్యాయం జరుగుతున్నా ఎదురుతిరగరు. పైగా గుంపుగా చేరి ఏడుస్తారు. శాపనార్థాలు పెడతారు. ఇది మన నేటి ప్రజాస్వామ్యం.

ఈ విషయాల తాలూకు వివరణలే ఈ గ్రంథం "బొజ్జాతారకం నీలిజెండా సంపాదకీయాలు" నిండా పొందుపరచివున్నాయి. 2008 జనవరిలో ప్రారంభమైన 'నీలిజెండా' పక్షపత్రికలో బొజ్జా తారకం రాసిన పలు సంపాదకీయాలతో తారకంగారి ద్వితీయ వర్ధంతి సందర్భంగా బొజ్జాతారకం ట్రస్టువారు ఈ పుస్తకాన్ని విడుదల చేశారు. బొజ్జాతారకం అనే పేరే చాలు ఎలుగెత్తిన తుపాకీ గుర్తుకొస్తుంది. సూటిదనం, నిక్కచ్చితనం వీరి కలంలో పొదిగి వుంటాయనేది పాఠకులకు విదితమే. అలాగే వీరు రచించిన కొన్నింటిని మనం పంచుకుందాం..

ప్రజల ఆర్థిక స్థితిగతులను పెంచేవిధానమే లేకుండా కేవలం రూపాయికి కిలోబియ్యం, కిలో గోధుమలు అంటే ఎలా? నెలకు 25 కిలోల బియ్యం అందిస్తే పేదరికం పోతుందా? ఈ పేదరికం రూపుమాపడానికి శాశ్వత పరిష్కారం అంటూ ఏమీ ఉండదా? దారిద్ర్య రేఖకు దిగువన ఉన్నవారి సంఖ్య తగ్గించే తీరులో ఏ పరిపాలన ఉండటం లేదనేదే వీరి ఆవేదన. డా॥ అంబేద్కర్ లాంటివారికే అవమానాలు తప్పటం లేదు. వారి శక్తిని, పోరాటాలను వక్రీకరించి అనేకమంది కాలం గడుపుతున్నారు. అంబేద్కర్‌ను బ్రిటీష్ తొత్తు అన్నారు. కమ్యూనిష్టులు లిబరల్ బూర్జువా అన్నారు. ముంబయిలో వీరు రచించిన 'రిడిల్ ఆఫ్ రామ్ అండ్ కృష్ణా" అధ్యయనాన్ని నిషేదించాలని ఉద్యమమే నడిపారని తెలిపారు.

అలాగే అత్యాచారాలపై దోషులకు కఠిన శిక్షలు వేయడం లేదనేదే వీరి ఆవేదన.ఎస్సీ ఎస్టీ ప్రజానీకం, దళిత పార్టీలు, సంఘాలు, ఎన్‌జీవోలు పనిచేయాల్సిన అవసరం ఎంతైనా ఉందనేదే అందరితో చర్చలు చేస్తారు. అవసరమైన చోట నిలదీస్తారు. బడ్జెట్ బురిడీ, శాసనసభకు అవమానం, రాజ్యాంగమూ ప్రైవేట్ రంగమూ, ప్రభుత్వమూ మార్కెట్, ఏడాదిగా ఎగురుతున్న నీలిజెండా, పాలస్తీనాపై ఇజ్రాయిల్‌దాడి, బాబ్లీ వివాదం, కంపెనీల పాలవుతున్న ప్రభుత్వ భూములు, కామన్ వెల్త్ క్రీడలలో అవినీతి తాండవం , పేదరికాన్ని పెంచుతున్న కేంద్రప్రభుత్వం లాంటివి 141 సంపాదకీయాలు ఈ గ్రంథంలో చోటుచేసుకు న్నాయి. ఇవి ఎంతో విలువైన గ్రంథాలు. విషయ సేకరణకు ఎవరికైనా ఉపయోగిస్తాయి. ఇవి సంపాదకీయాలు కావు ప్రభుత్వంపై సంధించిన అస్త్రాలు అనడంలో అతిశయోక్తి లేదు.

ప్రతులకు:
బొజ్జాతారకం ట్రస్టు,
ఫోన్:040–23521849.
ధర: 150/–



–శైలజామిత్ర
9290900879

## కరణేషు మంత్రి


కారణం తెలీదు
ఒక్కోసారి ఇంట్లోనే తప్పిపోయి
దిగులు మేఘమవుతాను

ఉన్నట్టుండి
గుండెల్లో ఎడతెరపిలేని
జ్ఞాపకాల జడివాన
దాడి చేస్తుంది

ఎలా కనిపెడుతుందో
నా అనురాగ గంగ
సడిలేని అడుగులతో నడిచి వచ్చి
తన కౌగిలి కవచాన్ని
రక్షణగా తొడుగుతుంది

ద్వారాలు కిటికీలు
మూసిన కాసేపటికి
గదిలోని గోడలు ఊడలుగా మారి
వేయి పున్నముల
వెలుగులు విరజిమ్ముతాయి

ఇక రోజంతా పెదవులపై
నవ్వులు విరబూస్తుంటాయి.



–మౌనశ్రీ మల్లిక్
8919338546

## కన్నీటి తర్పణ

ఏ సంఘటనైనా గుర్తుకు తెచ్చుకొని
ఒక్క కన్నీటి చుక్కైనా రాల్చుదామని సతమతవుతున్నాను.

దీనమ్మ – దుఃఖ ఆనవాళ్లు కనుచూపు మేరలో కనపడవు
కన్నీరింకిన కళ్ళలో.

ఎవరైనా కొంచెం సాయం చేయరూ!.
నాకొక పిడికెడు దుఃఖం కావాలి.

జీవితపు పరుగు పందెంలో
ఓడిపోయిన నా నేస్తానికి
కన్నీటి తర్పణ
వదలడానికి నాకొక పిడికెడు
దుఃఖం కావాలి...

హుందాగా నా దారిలో నేను నడిచెళ్లిపోతుంటే నా కాలికి
సన్నని ఇసుక రేణువు గుచ్చుకున్నా తల్లడిల్లిపోయే నా నేస్తానికి
కన్నీటి తర్పణ వదలడానికి
నాకొక పిడికెడు దుఃఖం కావాలి.

ఏ దారిలోంచి తన గుండె గుడిలో దూరిపోతానో తెలియక
నాలుగుదిక్కులు కలిసేచోట
తన చూపులు అతికించి
నా కోసం ఎదురు చూసి చూసీ
తనువు చాలించిన నా నేస్తానికి
కన్నీటి తర్పణ వదలడానికి
నాకొక పిడికెడు దుఃఖం కావాలి.

"ఆయన మూడో రోజు
తిరిగొస్తానని మరీ వాగ్దానం చేసి
మాట మీద నిలబడ్డాడట.

అసలు ఏ మాటామంతీ లేకుండా కాలంతో కలిసిపోయిన
నా ఆత్మీయ నేస్తానికి
కన్నీటి తర్పణ వదలడానికి
నాకొక పిడికెడు దుఃఖం కావాలి.

మంగళ వారం నాడు మానెడు,
సోమవారం నాడు సోలెడు వరాలు పోసినా మరణం
దొరకదని మా నాయనమ్మ చెప్పింది.
మా నాయనమ్మ మంగళవారం
బాల్చీ తన్నేసింది 102 వ ఏట.
నా ఆత్మీయ నేస్తం మాత్రం
తన తాహతుకు ఎక్కువైనా
శుక్రవారం నాడు అర్ధంతరంగా అంతర్ధానమైంది..

మళ్ళీ దీనమ్మ – ఏడుద్దామంటే
ఒక్క కన్నీటి చుక్కా కనబడక కళ్ళు ఎడారులయ్యాయి.

దానకర్ణులారా!
ఎవరైనా పుణ్యం కట్టుకొని
పిడికెడు దుఃఖం పంచండి
నా ఆత్మీయ నేస్తానికి
కన్నీటి తర్పణ వదలాలి.

పెరటిలో ఉన్న ఒకే ఒక్క మల్లె అంటు
ఎవరు పీక్కు పోయారోనని
అనుమాన పడ్డాను.
ఎంత మోజు కాకపోతే
పోతూ పోతూ మల్లె అంటును కూడా తీసుకుపోయిన
నా నేస్తానికి
కన్నీటి తర్పణ వదలడానికి
నాకొక పిడికెడు దుఃఖం కావాలి.



–విల్సన్ రావు కొమ్మవరపు
8985435515

## నాటకం

ఆహార్యమున మది కాహ్లాద మందించి
నటనతో మురిపించు నాటకమ్ము.

సందర్భశుద్ధియౌ సంభాషణల తోడ
నవరసమ్ములు చిల్కు నాటకమ్ము


తెలుగు భాషకు కొత్త వెలుగు జిల్గులు దిద్దు
దీటగు పద్యాల నాటకమ్ము

సరిగమ స్వరముల సంగీత మాధుర్య
నైపుణ్యమును జూపు నాటకమ్ము

ప్రాచీన జనపద పౌరాణికమ్ముల
పాటవమ్మును పెంచు నాటకమ్ము!

భరతముని వరుండొసగిన వరమనంగ
తెలుగు సంస్కృతీ విభవమ్ము తేజరిల్ల

నాట్య నటనాభియుక్త విన్నాణమెల్ల
తరతరమ్ముల కిడుడు మేధావులార!!



– చిమ్మపూడి శ్రీరామమూర్తి
9704177270

## అంతా మనదే

లక్ష్మణరేఖలు
తుడిపెయ్యి
తక్షణసాయం
అందియ్యి..
రక్షణకు
హద్దులేంది?
సమయానుకూల స్పందన
సమున్నతం..నీ స్థానం
సమస్యతో దరి చేరితే
సమస్యగా మారకు సుమా!

## ఉరి ఒద్దు

అమానుషం
అత్యాచారం
కామంధులను
వెలివేద్దాం
జీవచ్ఛవం
జీవితాంతం
మరణశిక్ష సరి కాదు
కరుణ జూపక కఠిణ శిక్ష
నరికై కాళ్ళు చేతులు
ఊరికి ఆవల విసిరై

**చందనాలు**



– పట్టాల అశోక్
సెల్:9849940479

పేరొందిన దొంగ
ఓ ఇంట్లో చొరబడ్డాడు
పని మొదలైంది
ఇంతలోనే ఆ ఇల్లు
తన కులపోల్లదే అని తెలిసింది
అప్పుడా దొంగ- పని ఆపేస్తాడా?

తెల్లారాకా దొంగ పట్టుబడ్డాడు
తీరా చూస్తే ఆ దొంగది తన మతమే....!
అప్పుడా యజమాని
దొంగని వదిలేస్తాడా?

ప్రక్షాళన చెయ్యాల్సింది
మనిషి అంతరంగాన్ని...!
ఊదితే ఊడిపోయే ఉపరితలం పైన కాదు!!

మునిమడుగుల ఫిలాసఫీ.

## నిజాలు!

ప్రశ్నించడం ప్రారంభించు–
సమాధాన పడ్తావో! సమాధానం రాబడ్తావో!!
బంధం పెనవేసుకో నీతో–
అనంతకాలం మిగిలేది నీకు నీవే.
వాడుకుంటా నీ సౌధపు కుడ్యం–
నా రచనలు ప్రచురించే గోడ పత్రికగా.
మూలాలు మరిస్తే ఎలా–
మతం మనసుదని ...కులం 'చేత'దని.
మూడు...మూగ గుడ్డి చెవిటి–
అన్నీ ఉండి స్మార్ట్ఫోన్తో నాలుగో కోతి అవిటి.
చింతన వంతెన కావాలి–
భావాల నెదలకు చేరవేసే కవిత్వంలా.

లక్ష్యం అక్షరమైతే–
భావాలు బారులు దీర్తాయి కైతలవడాన్కి.
ప్రతిభే ముఖ్యం వ్యక్తికన్నా–
వ్యాఖ్య ప్రశంసైతే వికాసమే ఏ కవికైనా.
నేలలోని వేర్లే మూలాలు–
పూలు పండ్లు చెట్లును చేరువ చేసేవైనా.
కౌగితం పూలే కవితలన్నీ–
అనుభవించి పలవరించ నపుడు.




–డా॥గొల్లపెల్లి రాంకిషన్
9849693324.





# దేశంలో ఎక్కడో ఓ చోట రోజూ జరుగుతున్న కిరాతకాలకు అంతం ఎప్పుడు? కిరాతకులకు కఠిన శిక్షలు ఎప్పుడు?

## అత్యాచారాలపై కవుల స్పందన




వేద భూమి
పుణ్య భూమి
పవిత్ర భూమి
స్త్రీలను పూజించు దేశం
సంస్కారానికి పుట్టినిల్లైన దేశం
శాంతికి నిలయమైన దేశం
ప్రపంచానికి ఆదర్శమైన దేశం "భారతదేశం"

భారతీయులందరూ
నా సహోదరులంటూ
ప్రతి ఒక్కరూ
బడిలో ప్రతిజ్ఞ చేస్తున్న దేశం

ఈ పుణ్యభూమిలో
పుట్టానని ఎంతగా పొంగిపోయావో
డాక్టర్ కావడానికి ఎన్ని కలలు కన్నావో
ఆ కలలు నిజం చేసుకోవడానికి
ఎన్ని నిద్రలేని రాత్రులను చూశావో
బంగారు భవిష్యత్తుకు
ఎన్ని ప్రణాళికలను రచించుకున్నావో

గాంధీ గారు కలలు కన్న స్వరాజ్యం
అర్ధరాత్రి స్త్రీ ఒంటరిగా తిరగ గలగిన
నాడే నిజమైన స్వరాజం
ఇంకా ఎన్ని సంవత్సరాలు గతించాలో
నిజమైన స్వరాజ్యం సిద్ధించడానికి

జనారణ్యంలో తప్పిపోయిన
లేడిపిల్లలా నీవూ నాగరిక మృగాలకు చిక్కి
ఆపద సమయంలో మెదడు మొద్దుబారి
ఎవరికి మొరపెట్టుకోవాలో తెలియక
దిక్కుతోచని పక్షివై అల్లాడితివా
నీ ఆక్రందనలు అరణ్యరోదనైయేనా

గుడిలోని దేవతనూ ,
పాడె మీద శవాన్ని కూడా
కామంతో చూసే కామాంధులున్నారే
సుకుమార కుసుమాన్ని
ఒక్కొక్క రేకునూ తుంచితుంటే
ఏ పాపమూ ఎరుగని
దేహం నిలువునా
కాలిపోతుంటే

ఆ మంటలు
ఆ అరుపులు
ఊరకే పోకూడదమ్మా
ఊరూరు దావానంలా వ్యాపించాలి
ప్రతివమనస్సునూ దహించాలి
రేపిస్టులకు రేపు అంటూ లేకుండా చేయాలి
నీ ఆత్మకు శాంతి కలగాలి !

– సురేంద్ర రొడ్డ
9491523570

వత్తి తాళ్లలా కనిపిస్తాయి కాని
కొండ చిలువలై అఘాయిత్య హంతకుల
మెడ చుట్టూ చుట్టుకుని ఉరి శిక్షాస్మృతులౌతాయి

ధర్మ పోరాటంలో ఉద్యమ జనంలా
లోక స్పృహగా తాళ్ల పాత్ర ముఖ్యపాత్రే మరి
ఇప్పుడు నాల్గు ఉరితాళ్లు అవతరించిన
సమయం ఆసన్నమైంది ధర్మసంస్థాపన కోసం !!

మూగ జీవాలకు చికిత్సచేసి అమృత పరిచే
'దిశ' ప్రాణాలను
కీచకంగా కిరాతకంగా దగ్ధం చేసిన
నల్గురు హంతకుల కోసం ఉరితాళ్లు
అనివార్యంగా గుంపుగా రావల్సిందే !

ఉరి కాటును మించిన కాటు ఏముటుంది
కాలకూట విషం కన్నా ఎక్కువ
కాటికి చేరినట్లే సూటిగా ---
భవిష్యత్తులో మానవ రూప మృగాలు
శిక్షల ఉరి తాడు తాండవం చూసి
పైన పిడుగు పడ్డట్టు గుండె ఆగి చావాల్సిందే

ఊరి తాళ్లకు స్వాగతం !
జనం జయహో నినాదాల మధ్య
భయంకర యమకింకర
ఉరితాళ్లకు సుస్వాగతం !

నిజమే ! శిక్షలన్నింటిలోన ఏ శిక్ష మేలు
నేరం చేయడానికి భయమనిపించే
ఉరి శిక్ష మేలు మేలు --
ధర్మం నాల్గు పాదాల పరుగెత్తుతుంది !

– కందాళై రాఘవాచార్య
9908612007

ఖజానా నిండాలి
కడుపునిండా తాగనిద్దాం
కేసులు కావాలి
నేరం జరగనిద్దాం
లాయర్లు బతకాలి
గోడు వినిపిద్దాం
తీర్పులు రావాలి
వచ్చేదాకా ఎదురుచూద్దాం
గొప్పోళ్ళ వ్యవహారం
అయితే వదిలేద్దాం
తాడూ బొంగరం లేనోడు
అయితే శిక్షిద్దాం
ఓట్లు సీట్లే మనధ్యేయం
నాయకులం మనం
పక్కనేమైనా పట్టించుకోం
సామాన్యులం మారం
మనుషులుగా ఎప్పుడో అంతరించాం
నిర్భయ మృగయంత్రాలమై సంచరిద్దాం
శవరాజకీయాలే కాదు
చచ్చిన దేహాలపక్కన సెల్ఫీలు దిగుతూ
అసామాజిక న్యాయం తప్పక
కలి ధర్మం పాటిద్దాం

–దేగల అనితాసూరి
9247500819

కన్నతీపి కనే కలలు ఎన్నో
కన్న తీపి పాపంగా మారింది
కలలు కల్లలైనాయి
ఉమ్మనీరు ఉక్కిరిబిక్కిరైంది
కంటి నీరు కాలువలు కట్టింది

దిగజారుతున్న విలువలు
ఊడుతున్న సంస్కార వలువలు
మసిబారిన తలపులు
కరుగుతున్న వలపులు
కొడిగట్టిన జీవన జ్యోతులు!!

కడుపులో బిడ్డ తంతే తీపి
కడుపుమీదనే అడ్డంగా తంతే పాపి!!
అమృత ధారతో పాటు నృత ధారలూ కురిపించాలి
సమయపాలన సంస్కార భావన నేర్పాలి!!

నైతిక విలువలు భారతాది కథల నీతులు తెలపాలి
మానవత్వం పెంపొందేలా మనీషిగా తీర్చిదిద్దాలి!!

మృగాలు అడవిలోనే లేవు
మానవ సమాజంలో విచ్చలవిడిగా సంచరిస్తున్నాయి
ఏప్రాణి కాప్రాణి
తెలివితో ఆత్మరక్షణ చేసుకోవాలి!!

ఎంత నీచ స్థితిలో కూడా
నమ్మి మోసం చెరలో చిక్కొద్దు
కళ్ళస్సే నీ దరి
వంద నంబరు నీకు దారి

నీ ఆత్మ విశ్వాసమే నీకు రక్ష!!
మానవ కామ వృకాలు ఎగబడ్డ లోకంలో
చిట్టి చెల్లెళ్లకు రక్షణ ఏది?

సరియైన శిక్షలు లేక బరితెగించిన వైనం
అరబ్ దేశాల్లోని శిక్షలు రావాలి
రోజు భయపడుతూ పశ్చాత్తాపంతో
కుమిలి కుమిలి బతకే శిక్షలు కావాలి!!

–డా.చీదెళ్ల సీతాలక్ష్మి
9490367383

చారిత్రాత్మక మహా నగరాల్లో దారుణాలు
మచ్చ తెచ్చే మగపుటేనుగుల దురంతాలు
గుండెలవిసి నెత్తురు మరిగించే ఘోరాలు
ఇగిరి పోతున్న మానవీయ విలువలు
డెభ్భైయేళ్ళ నిర్భయ భారతానికే అగ్నిపరీక్షలు
విశ్వనగరంలో 'ఆమె' భద్రతకే పంక్చర్లు
అన్నెం పున్నెం ఎరుగని పువ్వులు, మొగ్గల్ని
ఉన్మాదంతో ఊగిపోతూ కాటేసే పంజాలు
కామ కోరల్లో లేత కోమళ్లను చిదిమేస్తూ
విశృంఖల రాక్షసత్వానికి ఒడిగట్టే తోడేల్లు
ముసుగేసుకున్న మూర్ఖ మానవ మృగాలు
ఒళ్ళు గగుర్పొడిచే దాష్టికాలు,
దహన రీతులు మానప్రాణాల్ని
దారికాచిదోచే నీచనికృష్టులు
విగత జీవులౌతున్న అమాయకులు
పశుత్వానికి బలైబూడిదౌతున్న అబలలు!

అతినమ్మకమో,అమాయకత్వమో..
అజ్ఞానమో, అయోమయమో, దురదృష్టమో
ఖాఖీలకందని ఆఖరి అసహాయ ఆర్తనాదాలు
షీ టీంలు,గస్తీలు,సిసి కెమెరాల డొల్లతనాలు
అతివ అరుపులు అసురనిశిలోకలిసినక్షణం
నూరేళ్ల పడతి జీవితం బుగ్గిపాలైన వేళ
వెన్నులో చలిపుట్టి వణికింది భాగ్యనగరం
కన్నీటి సుడిగుండమైంది రాష్ట్రం
విషాదాంతంతో విలవిలల్లాడింది దేశం !

కీచకపర్వంలో నిందితులు నలుగురేనా ?
వ్యవస్థాగత వైఫల్యాల్లో దోషం ఏమి లేదా ?
ఆర్తనాదపూర్వమే ఆలోచనలకుపదునుపెట్టి
అతివలందరు ధీర వనిత సీతలై
రావణుల రాకను నిర్భయంతో పసిగట్టి
రాముని రాకకు నిస్సహాయంగా నిరీక్షించక
త్రిశూలం ధరించిన మహాశక్తి దుర్గలై
మధమెక్కిన మృగాళ్ల పీక నిర్ధయగా పిసికి
ఝాన్సీరాణిలా సబలత్వాన్ని సజీవం చేస్తూ
పర్ణశాల సీతల్నిసైతం దేవతల్లాపూజించాలె!

– డా।। బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037

'దిశా'
సిగ్గేస్తుందమ్మా క్షమించు,
ఈ అఘాయిత్యాన్ని చూసి మౌనంగా రోదిస్తున్న
మగవాడిని...మూగవాడిని నన్ను క్షమించు,

పశువైద్యురాలివి తల్లీ,
ముందున్న ఆ పశువుల్ని గమనించలేని
నీ అమాయకత్వాన్ని చూసి సిగ్గేస్తుంది,

పంటి బిగువున దాచిన కోపం,
ఎవరి పై తీర్చాలో తెలియక మదన పడుతున్న,
మగవాడిని....మూగవాడిని నన్ను క్షమించు,

ఆడతనం వైపు ఆశగా చూసిన ఆ కామాంధులది,
నాది ఒకే జాతి, మగజాతి అయినందుకు సిగ్గేస్తుంది,

అబల స్వేచ్ఛగా తిరగలేని నా స్వతంత్ర భారతంలో...
స్వర్ణోత్సవాలు, వజ్రోత్సవాలు చేస్తుంటే....సిగ్గేస్తుంది,

చదువుల బడిలో, దేవుడి గుడిలో,
పసిమొగ్గవో, పండుముసలివో...
ఎలా ఐనా, ఎక్కడైనా.... బలవుతున్న ఓ అబల
నిను చూస్తుంటే నాపై నాకే సిగ్గేస్తుంది..

కట్నాలకు భయపడే రోజు నుండి,
కామానికి భయపడే రోజుకు చేరుకున్నందుకు,
ఈ రెండిటికి కారణమైన మగవాళ్లను చూస్తుంటే,
నిజంగా సిగ్గేస్తుంది.

–జాబేర్.పాషా
0096897663604

అర్ధరాత్రి ఆడపిల్ల స్వేచ్ఛగా తిరిగితేనే
స్వాతంత్ర మన్నాడు మహాత్మా
ఎప్పోడొస్తుంది స్వాతంత్ర్యం
అని ప్రశ్నిస్తుంది ఆడపిల్ల అంతరాత్మా ?

మంచితనాన్ని మానభంగం చేసారు
మానవత్వాన్ని కాల్చి బూడిద చేశార
భారతీయులందరూ నా సహోదరులు
అనలేని అనైతికం
ఆడదిలో అమ్మను చూడలేని మూర్ఖత్వం

ఆకాశంలో చుక్కలా మెరవాలనుంది
కానీకోర్కెల. బడబాగ్నిలో
మసి చేసి,నుసిచేసి,చుక్కల్లో కలిపేస్తున్నారు
ప్రకృతిలో ఓ ఆకృతినై మురవాలనుంది
కానీ ఆధిపత్యం నీడల్లో రక్కేసి తొక్కేసి
పంచ భూతాల్లో కలిపేస్తున్నారు !

మృగత్వం వెర్రి తలలు వేస్తుంది
మధత్వం విర్రవీగుతుంది.
కామాంధుల వేటుకు సభ్య సమాజం
సిగ్గు పడుతోంది.
అవయవాల పోటుకు అమ్మతనం ఏడుస్తుంది,
ఎంత కాలం
ఈ ఆరని మంటల ఆడతనం జ్వాలలు
ఎంత కాలం
ఓరిమి సహించే నారీ జన్మం బలులు
మారాలి ఈ అమానుషత్వపు స్వార్థం
వినిపించాలి మనిషితత్వపు స్వేచ్ఛా గీతం
వనితలకు ఓదార్పు నిచ్చే రాతలు వద్దు
జీవితాలకు భరోసానిచ్చే చేతలే ముద్దు

–సముద్రాల శ్రీదేవి,9949837743

వాడి సెక్స్-రే
చూపులు స్తనాల్లో
దిగబడి కామ వికారంతో....
యోనులోంచి బయటకొస్తూ..
అమాయక యువతుల
మానప్రాణాలనమానుషంగా
ఆటవికంగా నిస్సహాయ స్థితిలో
నివురుగప్పిన నిప్పుల్లా..
అదనుజూసి కాల్చేస్తున్నాయ్!

ఆలోచన రహితులై
కామతాపాధములై
నిషాదులై విచక్షణ విహీనులై
జనారణ్యంలో రహదారుల్లో
సందు దొరికితే కామనాగుల్లా
స్త్రీలను కబంధ హస్తాలతో
మాటువేసి కాటు వేస్తూనేవున్నా రు!

వీరికి చిన్న
చితక తారతమ్యం లేదు
ఆడది కనిపిస్తేచాలు
అభినవ కామ దానవులై
ఊళ్ళో పట్టణాల్లో
రహదారుల చీకట్లో
రణగొణ ధ్వనుల
మరణమృదంగసవ్వడిలో
తరుణీ మణులను కామేష్ఠిలో
రావణ కాష్టం రగిలిస్తూ...
కామాన్ని చల్లబరచుకుంటున్నారు!
×××
త్రాస్టులారా! భ్రష్టుల్లారా !
నయవంచక దుర్మార్గుల్లారా !!
మానవీయతకు మచ్చను జేసే
మానవ సంబంధాలను
నాశనంచేసే కర్కోటకుల్లారా !!!
మిమ్మల్ని మీ మగసిరిని
వృషణాలను తొలిగించే
చట్టం తెస్తేనే స్త్రీజాతికిరక్ష... !!!!

–డా. గన్నోజు శ్రీనివాసాచారి
9490145913

తొమ్మిదినెలలు కడుపులోమోసిన
మీయమ్మశ్రమ వృథా అయిపోయింది
పాతికసంవత్సరాలు కంటిపాపలా సాకిన
మీనాన్న కళలప్రపంచం కళ్ళముందే కూలిపోయింది.
ఎన్నిఆశలు మదినిండానింపుకున్నావో
ఎన్నెన్నిరాత్రింబవళ్ళు పరితపించావో
నీలక్ష్యం ఎంతదైనా వెరవలేదూ,వెనకడుగేయలేదు
అనుకున్నది సాధించి అమ్మానాన్నను మురిపించావు
అంతలోనే యెంతమోసపోయావమ్మా!
ఇది స్వతంత్రదేశమని సంబరపడ్డావా?
ధర్మభూమి,వేదభూమియని అపోహపడ్డావా?
అంతా సోదరసోదరీమణులమేననుకున్నావా?
అక్షరాలలోనే ఆ లక్ష్యం సాధించిన దేశమిది
అలక్షమన్నది అణువణువునా జీర్ణించుకున్న రాజ్యమిది
పక్కోడింటినితగులబెట్టి చలిగాచుకోవాలనుకునే
సంస్కారమున్నదేశంలో పలుచనైపోయింది స్త్రీజీవితం
నిండుసభలో ద్రౌపదిని చెరబడుతుంటే
మేథావులు మౌనమువహించుటతోనే
మహిళపై మహిలో చిన్నచూపు మెదలైంది
ఆనాటినుండే స్త్రీయంటే
(స్త్యాయతి సంఘాతో భవత్యస్యాం గర్భ ఇతి)
గర్భమును ధరించునదని మర్చిపోయి
కామాగ్నిని చల్లార్చే కాంచనజలమనుకుంటున్నారు.
'కలి' ఆడుతున్న వికృతక్రీడతో
కలుషితవాతావరణంలో మత్తెక్కిన యువత
చెడుఆలోచనలతో కుళ్ళిపోయిన మెదళ్ళు
కామవాంఛతో రగిలిపోతున్న ఒళ్ళు
రెండు కనికరపుమాటలుమాట్లాడాయని కరిగిపోయావా?
గొంతుకోసేముందు నీళ్ళుత్రాపినట్లు
నినునమ్మించారుతల్లీ!
మనుషులరూపంలో వున్నారుకాబట్టి
అన్నలో,తమ్ముల్లో అనుకున్నావా?
అరణ్యాలలో జంతువులేనయమని అనుకోకుంటావు
మనుషులుండేభూమేకదా అని భ్రమపడితివేమో!
వారేనీపాలిటి యమకింకరులౌతారని ఊహించకుంటావు
ఎంతమోసపోయావమ్మా!
ఈ క్రూరమృగాలకు నీశరీరమే
ఎరఅవుతుందని తలవకపోతివి
ఎన్నిచెప్పినా,ఎన్నిచేసినా ఈ పురుషాధిక్యసమాజానికి
'అబల'మరొక్కసారి'కబలమ'య్యింది.
మనుషులమధ్యనే మరణరోధన మాయమైపోయింది
ఏడవాల్సింది నీవుకాదు తల్లీ?
గ్రహగ్రహాలపై జీవాన్వేషనచేస్తూ
తోటిప్రాణులనే కాపాడుకోలేకపోయిన మేము
శిథిలమైపోయింది నీ తనువుగాదమ్మా!
తరతరాలనుండి కాపాడుకుంటున్న మానవవిలువలు.
పంచభూతాల్లోకలిసిన నీ పంచప్రాణాలు
పంచభూతాలసాక్షిగా ప్రపంచగమనాన్ని మారుస్తాయనీ
నీ ఆత్మశాంతికోసం......
నా అక్షర నివాలి.
(ఇటీవల జరిగిన సంఘటనపై నిరసిస్తూ...)

–డా.వేముల శేఖరయ్య
9491376896.

చేతిలోని పుస్తకంలోని
అక్షరాలను చదవడం లేదు వాడిపుడు

అందులో దాగిన
అంతు బట్టని అంతర్ రహస్యాన్ని
వెదుకుతుంటాడు

వాడి కళ్ళముందు కనబడే
అమ్మను సైతం లెక్కచేయడు

ఆమెలో దాగిన ఆడతనాన్ని
నికృష్టపు కళ్ళతో అణువణువు తడుముతుంటాడు
వాడి పక్కన నడిచే ఏ ఆడదైనా వాడికి పర్వాలేదు

వాడికి కావలసిందల్లా
కామంతో రగిలే కోరికలను
తీర్చుకునేందకే రోజుల తరబడి ఆరాటపడుతున్నాడు

చేతిలో గంటలకొద్ది ఒదిగిపోయే
సొల్లు సోదులు చెప్పె సెల్లుంటే చాలు

వొళ్ళు మరచిపోయి
అశ్లీల చిత్రాల మీద
రోజంతా అలసట లేకుండా కళ్ళతుకేస్తాడు

వాడు వీడనే
తేడాలేదిపుడు 'మగ'
అనే మాట వినపడగానే
ఆలస్యం చేయకుండా
అనుమానించాల్సిన
అవసరం వచ్చేసింది

అవసరం కొద్ది
ఆడవాళ్ళకు తోడుండే వాడు
మంచోడోకాదో అనే ఫలితాన్ని
క్షణాల్లో తేల్చే లేజర్ ఎక్స్ రేలు కనిపెట్టాలి!!

–జవేరియా
9849931255

అమ్మ కడుపులోన లేదు
పుఢమి పైన అసలు లేదు
ఎక్కడమ్మ స్త్రీ జాతికి రక్షణ...
ఇంకెక్కడమ్మ స్త్రీ జాతికి రక్షణ... "అమ్మ"

అభార్షన్ల్ పేరు తోని అమ్మ కడుపులోన చంపె
అత్యాచారాలు చేసి భూమి మీద హత్య చేసె
ఎక్కడమ్మ మీ మానాలకు రక్షణ....
ఇంకెక్కడమ్మ మీ ప్రాణాలకు రక్షణ... "అమ్మ"

కన్నవాడె కామాంధుగ మారిపోయి కాటు వేస్తే
కాపాడే కను రెప్పలె కాటు వేసి కాల్చి వేస్తె
ఎవరిని నమ్మాలి స్త్రీ జాతి జగతిలో.....
ఇంకెవరిని నమ్మాలి స్త్రీ జాతి అవనిలో... "అమ్మ"

బందువులే రాబందులై మానాలను దోస్తుంటె
స్నేహితులే నమ్మించి ప్రాణాలను తీస్తుంటే
ఎవరిని నమ్మాలే ఈ సమాజంలో స్త్రీ జాతి...
ఇంకెవరిని నమ్మాలే ఈ లోకంలో స్త్రీ జాతి... "అమ్మ"

అనాగరిక సమాజంలో ఆటవిక యుగంలో
స్త్రీ జాతికి రక్షణ మృగ జాతికి శిక్ష లేదు
నమ్మబోకు ఎవరిని స్త్రీ జాతి ఇంకెప్పుడు...
ఎప్పుడు నమ్మబోకు మృగజాతి స్త్రీ జాతి...."అమ్మ"

– ఉప్పెన
8106073661

మనిషే భయపెడుతున్నాడిప్పుడు
మానవత్వం చిగురించని మనిషే భయపెడుతున్నాడు
కామంలో కూరుకుపోయిన మనిషంటేనే దడ...
క్రూర మృగాలకన్నా దయకలుగుతుందేమో
దయలేని మానవ మృగాలుకదా
చంపటమే అలవాటు వీటికి
అనుబంధాలు ఆప్యాయతలు
ఈమృగాలకు ఏ పరిమళాన్ని అద్దలేవు...
అమ్మా ఆలి అక్క చెల్లి పదాలను
మింగేసిన కామాంధులు
ఒళ్ళంతా కోరిక పూసుకున్న చీడపురుగులుకదా
పిచికారీ చేసినట్టు ఏరేయాల్సిందే...
పురుగూ పుట్రా భయంలేదిప్పుడు
తప్పించుకోవచ్చు..రక్షించే మనిషే ఇప్పుడు భక్షకుడు
కాటేసే మానవ మృగాలను శిక్షించే వ్యవస్థే నీరసిస్తుంటే
మనుషులను నమ్మలేని కాలంలో
ప్రాణానికి ప్రాణమన్న నేచురల్ జస్టిస్ అమలుచేస్తామని
దేవుడో దయ్యమో దిగొస్తే బావుండు
సత్వర న్యాయం కోసం..
బందీయైన మానవత్వాన్ని విడిపించటంకోసం...
(ఇటీవల మానవ మృగాల దాడికి బలైన
అమాయకురాలికి నివాళులర్పిస్తూ...)

–సి.యస్.రాంబాబు
9490401005

ముక్కుపచ్చలారని వయసులో
చిన్నారులను చిదిమివేసి అత్యాచారానికి
వేటాడే పశుతత్వం ఇంకెన్నాళ్లు?
కాపాడే మానవత్వం కనిపించెదెప్పుడు?


నడిబొడ్డున నయవంచనతో పోకిరీలు
రోడ్లపైన విచ్చలవిడిగా విహరిస్తు
కళాశాలల్లో కామాంధుల తాకిడి ఇంకెన్నాళ్లు ?
శిక్షించే మానవత్వం కాన వచ్చేదెప్పుడు?


అరణ్యంలోని మృగాల్లా వేటాడుతూ
పట్టపగలే బహిరంగంగా సాటి
మనుషుల్ని హత్య చేసే దుర్మార్గుల
దుశ్చర్యలు ఇంకెన్నాళ్లు?
రక్షించే మానవత్వం కాన వచ్చేదెప్పుడు?

బాల్యంలో పాఠ్యాంశాలు చదవాల్సిన
వయసులో రెక్కలు ముదరని చేతులతో
పనులు చేయించే దౌర్భాగ్యం ఇంకెన్నాళ్ళు
కరుణించే మానవత్వం కాన వచ్చేదెప్పుడు?

ధనవంతులను దోపిడీ చేయడానికి
సంబంధాలను విడదీస్తూ
హింసించే కీచకత్వం ఇంకెన్నాళ్ళు?
కాపాడే మానవత్వం కాన వచ్చేదెప్పుడు?

–కమ్మరి శ్రీనివాస్ చారి,9177324124










(ఐ డ్రీమ్ తెలుగు, యూట్యూబ్ చానెల్ కోసం ప్రముఖ కవి ఎన్. గోపి గారితో ఆచార్య సి. మృణాళిని జరిపిన ముఖాముఖి)

**'మృత్యువు ఊసుతెచ్చి భయపెట్టకండి నన్ను,**
**కాలం రహస్యం తెలిసినవాణ్ణి కాలానికి భయపడతానా?' అని నిర్భయగీతిని ఆలపించిన కవి, మానవీయ కవి కాలం కంటే మనిషి గొప్పవాడు అని తీర్మాణించిన కవి ఆచార్య ఎన్. గోపి గారు.**
**'అమ్మ రుణం తీర్చుకోవాలంటే**
**అమ్మకు అమ్మాయి పుట్టాలి' అనే సూక్తుల లాంటి అనేక కవితా పంక్తులు ఆచార్య గోపిగారి కవిత్వంలో మనకు దర్శనమిస్తాయి.**

**1967 నుండి ఈనాటి వరకు అవిశ్రాంతగా కవిత్వం రాస్తూ 24 కవితా సంపుటాలను ఆయన ప్రచురించారు. అంతేకాదు కవిత్వానికే తన సాహిత్యం అంకితం చేయకుండా చాలా అద్భుతమైన యాత్రా చరిత్రలు, గొప్ప పరిశోధన, విమర్శ అన్నీ ప్రకటించారు.**
**అంతే కాకుండా 'నానీలు' అనే సరికొత్త ప్రక్రియను కూడా సృష్టించారు. బహుముఖ ప్రజ్ఞాశాలి అయిన ఆచార్య ఎన్. గోపి గారే ఈనాటి అక్షర యాత్ర అతిథి.**

**మృణాళిని :** నమస్కారం సార్!

**గోపి :** నమస్కార మమ్మా!

**మృణాళిని : ముందు మీ నేపథ్యంలోకి వెళ్దాం. మీరొకచోట అన్నారు మీ గురించి మీరు చెప్పుకునే క్రమంలో, చిన్నప్పుడే స్కూల్ లో ఉన్నప్పుడే వేయి పడగలు నవలని మూడు రోజుల్లో చదివేసాను అని. బహుశా మీ సాహిత్య ప్రస్థానం అది చదవటంతో ప్రారంభమై ఉండాలి. దానికి ఏమిటి నేపథ్యం.**

గోపి : మా ఊరిలో మా ఇంటి దగ్గరలో తాలుకా శాఖ గ్రంథాలయం ఉండేది. ఇప్పటికి కూడా ఉంది. అక్కడ లేదు కాని ఇంకో చోట ఉంది. దానిలో 3000 పుస్తకాలుఉండేవి. నాకు పుస్తకాల పురుగు అనే పేరు ఉండేది. నేను ఆ రోజుల్లో 5 రూపాయలు డిపాజిట్ కట్టి ఆ లైబ్రెరీ అంతా చదివేశాను, రోజూ పుస్తకాలు తెచ్చుకొని.

**మృణాళిని : మీ ఊరంటే**

**గోపి :** భువనగిరి, నల్లగొండ జిల్లా భువనగిరి. ఇప్పుడు యాదాద్రి జిల్లాకు వచ్చింది. ఆ వరుసలో ఒకరోజు వేయి పడగలు తెచ్చి చదివాను. మీరు నమ్మడానికి సిద్దంగా ఉన్నారో లేదో తెలియదు కాని 3 రోజుల్లో చదివాను రాత్రింబవళ్ళు.

**మృణాళిని : అది నమ్మశక్యంగా లేదు నిజంగా (నవ్వుతూ)**

**గోపి :** మూడు రోజుల్లోనే చదివాను. అర్థమయిందా అంటే ఇక తొమ్మిదో తరగతి పిల్లవాడికి అర్థమైన కాడికి. ఒక నోటు బుక్ తీసుకుని కష్టమైన గొట్టుపదాలు ఉంటే వాటిని రాసుకుని డిక్షనరీలో చూసేవాణ్ని. పీయూషం అనే మాట ఉందనుకోండి అప్పుడు పద్యాలురాస్తుండేవాణ్ణి. పియూషము అనగానే ఉత్పలమాలలో ఆ మాట అమురుతుంది అనుకునేవాణ్ని. అట్లా పెరిగాను నేను.

**మృణాళిని : ఇప్పుడు చదవాలంటే చాలా రోజులే పడుతుంది**

**గోపి :** పడుతుంది.

**మృణాళిని : మీరే చెప్పారు పద్యాలు ముందు రాసాను అని ఒక మిత్రునితో పద్యాలతో ఉత్తరాలు కూడా రాసుకున్నారని అసలు ఆ పద్యాలు ఎందుకు వొదిలేశారు?**

**గోపి :** నేను 8 వ తరగతి నుండి మంచి పద్యాలు రాశాను. ఆ పద్యాల మీద దాశరథి, దువ్వూరి రామిరెడ్డి ప్రభావం ఉండేది. విపరీతంగా పద్యకవిత్వం చదివాను నేను. ఆ అప్పుడు 'శశీ' అని ఒక శతకం రాశాను. పొద్దున కూర్చోని రాత్రి వరకు శతకం మొత్తం. ఆ శైలి చూస్తే ఇప్పటికీ నాకే ఆశ్చర్యం. శశీ అనే మకుటంతో

> **"చుక్కల పూలు పూచినవి సుందరమైన మొగుళ్ల వాటిలో**
> **మక్కువ మీర కల్వ చెల్లి మాటికి మింటిని చూచుచుంకై**
> **పెక్కిన కన్నులన్ ప్రియుల కింపును గూరె నవోల్లనన్**
> **గుక్కను బట్టె కుర్రడు చకోరసంఖా కనిపించరా శశీ!**

**మృణాళిని : చాలా బాగుంది సార్, పద్య కవిత్వం కూడా రాశారు. పుస్తకం కూడా వేసుండొచ్చు గదా?**

**గోపి :** వంద పద్యాలు రాశాను. వెయ్యలేదు.

**మృణాళిని : అవి ప్రచురించరా మరి?**

**గోపి :** ఇంకా వెయ్యలేదు. అవి పత్రికల్లో వచ్చినవి. సప్తతి లాంటిదేమన్న జరిగితే దానికి వేసుకోవచ్చు. ఒక క్రమపరిణామం తెలుస్తుంది కదా! నేను పద్యాల నుంచే వచ్చాను. నాకు మను చరిత్ర, వసుచరిత్ర స్కూల్ టైం లోనే నోటికి వచ్చేవి. ఆ వాతావరణం కూడా కొంత ఉండేది. రామదాసు రావు గారు అని గొప్ప తెలుగు ఉపాధ్యాయుడు, ప్రాతఃస్మరణీయుడు, ఆయన నాకు పెద్ద ప్రేరణ అన్నమాట!

**మృణాళిని : మీరు ఇంజనీరింగ్ సీటు వస్తే ఒదిలేసుకొని తెలుగు చేశారు. ఆ నేపథ్యం చెప్పండి? ఎందుకు అలా చేశారు ఆ రోజుల్లో ?**

**గోపి :** నాకు ఇంజనీరింగ్ లో సీటు వచ్చింది. నేను తెలివైన విద్యార్థినే కాని నాకు కవిత్వం పిచ్చి బాగా ఉండేది. మా లైబ్రెరీలో నారాయణ రెడ్డి గారి 'స్వప్నభంగం' చదివి ఆయనకు ఉత్తరాలు రాశాను. చాలా గొప్పవాడు. స్కూలు విద్యార్థికి వెంటనే జవాబు రాశాడు ఆయన. అందుకే ఆయన అంత గొప్పవాడయ్యాడు. అందులో గేయశైలి నాకు బాగా నచ్చేది.

> **'నాకు రెక్కలు మొలిచి**
> **నవి పిలిచినవి, పయో**
> **ధర భరమ్మల్లాడ**
> **తరుణ తారలు నన్ను**
> **తారలో తారలను**
> **తలదన్ను అప్సర**
> **స్తరుణులో నా గుండె**
> **తలనిమిరినట్లాయె'.** ఇట్లా ఉండేది ఆయన శైలి.

**మృణాళిని : మీరు నోటికేవుందే అది!**

**గోపి :** నాకు మొత్తం వచ్చు. నాకు జ్ఞాపకశక్తి బాగా ఉండేది. ఇప్పటికీ పరవాలేదు. అప్పుడు ఆయనకు ఉత్తరం రాస్తే, ఆయనను చూడడానికి ఆర్ట్స్ కాలేజ్ కి వచ్చి కలిస్తే, అట్లా ఆ స్కూలు విద్యార్థిని ఆదరించడం, నేను నారాయణ రెడ్డి గారి లాగా ఒక కవిని కావాలనుకునేవాణ్ని. అప్పుడు ఇంజనీరింగ్ సీటు రావడం చాలా గొప్ప. మార్కులతో వచ్చేది. అందుకే ఇంజనీరింగ్ కాలేజిలో చేరాను నేను. కాని నా మనసంతా ఆర్ట్స్ కాలేజి వైపు ఉండేది. అందుకని అప్పుడు నారాయణ రెడ్డి దగ్గర కెళ్ళాను. వెళ్ళి నేను 'బి.ఏ చేరుదాం అనుకుంటున్నాను' బి.ఏ లో. బి.ఏ ఎందుకు? అన్నారాయన. 'నేను కవినౌదామని. ఎం.ఏ చేద్దాం అని' 'కవికీ ఎం.ఏ కి ఏం సంబంధం అన్నారాయన'. అంటే 'మీరు ఉన్నారు కదా సార్. మీ పాఠాలు విందాం అని'. 'సరే నేనైతే సలహా ఇవ్వను. టైం అయిపోయినట్టు ఉందని అవధాని గారు, దివాకర్ల మహానుభావుడు ఆయన దగ్గరకు వెళ్ళి 'గోపి అని మంచి ప్రతిభావంతుడు తెలుగులో చేరుతానంటున్నాడు. మరి టైం అయిపోయింది' 'అలాగేనండి అని ఆయన అడ్మినిస్టేట్ బ్లాక్ కి వెళ్లి స్పెషల్ పర్మిషన్ తీసుకొచ్చారు నాకోసం. బి.ఏ లో చేరాను. అట్లా బి.ఏ, తరువాత ఎం. ఏ,సంగతి మీకు తెలిసిందే కదా.

**మృణాళిని : కవిత్వం గురించి మాట్లాడిన తర్వాత మనం పరిశోధనకి వెళ్దాం. మీ వచన కవిత్వం 'తంగెడు పూలు' నుండి మీకు బాగా పేరు వచ్చింది. గుర్తింపు రావడం ప్రారంభం అయింది. తంగెడు పూలు పూర్తిగా తెలంగాణ మట్టికవిత అది ఎప్పుడు రాసారు, దానికేమైనా నేపథ్యం ఉందా?**

**గోపి :** తంగెడు పూలు వచన కవిత్వం. పద్య కవిత్వంలో నుంచి వచన కవిత్వంలోకి వెళ్ళాను నేను. పద్యాలు మానెయ్యలేదు కాని వచన కవిత్వం కాలానుగుణంగా రాస్తునేఉన్నాను. నేను మొట్ట మొదట రాసిన వచన కవిత్వం తంగెడు పూలు. 1967 లో అప్పుడు నా స్కూల్ ఫైనల్ అయిపోయింది. అది చాలా మందిని ఆకర్షించింది. బి.ఏ, లో చేరాను దాని తర్వాతి వచన కవిత్వ 'కత్తి కార్చిన కన్నీరు' వరవరరావు నడిపిన సృజన వారి కవితల పోటీలో ప్రత్యేక బహుమతి వచ్చింది దానికి. అది ఒక మంచి జ్ఞాపకం. రాచమల్లు రాంచంద్రారెడ్డి అప్పుడు సంవేదన పత్రిక సంపాదకీయంలో ఈ కుర్రాడు బాగా పైకి వస్తాడని రాశాడు. మంచి శైలి ఉంది అని, ఇది కూడా ఒక మధురమైన జ్ఞాపకం. ఇంకోటి ఏంటంటే పాటిబండ్ల మాధవ శర్మ గారు నాకు ప్రియమైన గురువు. నన్ను చాలా ఇష్టపడేవారు. ఆయన షష్టి పూర్తి జరిగితే దానికి విశ్వనాథ సత్యనారాయణ వచ్చాడు. నేను కార్యకర్తను. 'వీడెవడు' అన్నాడు నన్ను చూసి. 'గోపి



అని మంచి కవి అన్నాడు' మా గురువు. 'కవి అంటే మనది రాస్తాడా వాడిది రాస్తాడా' అన్నాడు విశ్వనాథ. 'మనది బాగా రాస్తాడు వాడిది ఇంకా బాగా రాస్తాడు అన్నాడు పాటిబండ్ల. నేను ఈ శశీ శతకంలోని పది పదిహేను పద్యాలు వినిపించాను. అప్పుడు విశ్వనాథ సత్యానారాయణకు రెండు మైళ్ల దూరంలో ఉన్న మాతృశ్రీ అపార్ట్ మెంట్స్‌కి వెళ్లాలి. వాకిట్లో ఆయన రిక్షా రెడిగా ఉంది. నేను పద్యాలు వినిపిస్తున్నప్పుడు ఆయన స్టైల్ లో అటూ ఇటూ చూస్తూ నా వైపు చూడకుండా పద్యాలు విన్నాడు. విని 'శర్మా! రిక్షాను పంపించేయ్ నేను వీడితో నడిచి వెలుతాను' అన్నాడు. నాకిది పెద్ద అభినందన. ఆ తర్వాత పద్యాలు విని ఏమన్నాడంటే వీడికి ధార ఉంది అన్నాడు. అది గొప్ప కాంప్లిమెంట్. కాలేజి స్థాయిలో ఉండే నాకు అది గొప్ప జ్ఞాపకం.

**మృణాళిని : అప్పట్లో మీరు నారాయణ రెడ్డి గారికి చూపించేవారా మీరు రాసిన కవితలు ఎందుకంటే ఆయన స్టూడెంట్ గద మీరు?**

**గోపి :** ఒకసారి రెండు కవితలు చూపించాను. 'అద్వైతం, కన్నీరు' అని రెండు కవితలు చూపెడితే ఆయన స్రవంతి అని హిందీ ప్రచార సభ వాళ్ళ పత్రిక, దాని సంపాదక మండలిలో ఉన్నారు. దానికి పంపించారు. దాంట్లో




'మార్చి 1991లో 'కాలాన్ని నిద్రపోనివ్వను' పుస్తకావిష్కరణలో డా॥సి. నారాయణరెడ్డి, శీలావి, ఎన్.గోపి తదితరులు.

వచ్చినవి. అంతకుముందు ఆయనకు పద్యాలు చూపించాను. శశీ శతకంలో ఆయన 'నీ రాగమందెట్టిదో ద్యుతీ భోగము గూర్తువీ పుడమి. అని రాస్తే ద్యుతి ఇకారానికి సమాసం బాగలేదు ప్రభాభోగము' అను అన్నాడు. ఇటువంటి సవరణలు నాకు గుర్తున్నాయి. ఆయనది శాబ్దికమైన శ్రవణేంద్రియం. మాటకుండే సౌష్టవాన్ని ఆయన గుర్తించినంతగా, చాలా తక్కువ మంది గ్రహించేవారు.

**మృణాళిని : మీరు తంగెడు పూలను 1976 లో పుస్తకంగా వేశారు. అప్పుడు కుందుర్తి ఆంజనేయులు గారు ఉన్నారు. ఆయన కూడా మీ గురించి చాలా బాగా**



**చెప్పారు. వచన కవిత్వానికి కుందుర్తిగారు సిద్ధాంత కర్త అంటాం గదా. అప్పటినుండి మీరు వచన కవిత్వం పై పూర్తిగా దృష్టి పెట్టారా ?**

**గోపి :** అంతే! దాని తర్వాత ఆ తంగెడు పూలు వేసే వరకు మరో 26 కవితలు రాశాను. ప్రతి కవితా కవి సమ్మేళనాల్లో పాల్గొనడం వల్ల ప్రాచుర్యాన్ని పొందాయి. దాని తర్వాత వేమన మీద పరిశోధనలో మునిగి పోయాను. నేను ఏం పని చేసినా చాలా సీరియస్ గా చేయడం అలవాటు. నాకు 540 జీతం ఉన్నప్పుడు వేమన పరిశోధనకు యాభై వేలు ఖర్చు పెట్టానంటే నమ్మగలరా! మెటీరియల్ కలెక్షన్ కోసం మద్రాస్ లో ఒక 70 రోజులు ఉన్నాను తిరుపతిలో ఒక నెల రోజులున్నాను. అప్పుడు తెలిసింది నాకు. ఉన్నదంతా ఎం.ఏ పాండిత్యమే. అసలు పాండిత్యం లోకంలో సంపాదించాలి అని.

**మృణాళిని : 'వేమనగోపి' అని పేరుండేడి కొంత కాలం. అయితే పిహెచ్.డి తో ఆపేయకుండా తర్వాత కూడా కొనసాగించారు. మామూలుగా పిహెచ్.డి తర్వాత వదిలేస్తారు కదా!**

**గోపి :** చాలా మంది ఏమంటారంటే పరిశోధనకు కవిత్వానికి చుక్కెదురని. కొంత నిజం కూడా అది. నా విషయంలో ఎందుకో వైరుధ్యం రాలేదు. పరిశోధనను పరిశోధన పద్ధతులలోనే చేశాను. కాకపోతే ఒక నాలుగేండ్లు మధ్యలో వ్యవధానం వచ్చింది. 'తంగెడు పూలు' తర్వాత ఐదేళ్ళ దాకా కవిత్వం రాయలేదు. మైలురాయి సంపుటివేసే దాక. వేమన పరిశోధన కాలంలో ఆ మద్రాసు లో ఉన్నప్పుడు ప్రాచ్య

1

లిఖిత గ్రంథాలయంలో పదిహేను వేల పాఠాంతరాలతో మూడు వేలచిల్లర పద్యాలు నేను ఎత్తి రాసుకున్నాను. అప్పుడు జిరాక్స్ అందుబాటులో లేదు. రోజుకు 150 పద్యాలు రాసుకునేవాణ్ని. ప్రాచ్య లిఖిత గ్రంథాలయానికి వెళ్ళి. నమ్మండి రాయడం వల్ల వేళ్లలోంచి నా శరీరంలోకి విద్యుత్తు ప్రవహిస్తున్నట్టనిపించేది. 'శ్రమములోన పుట్టు సర్వంబు తానౌను విశ్వదాభిరామ వినురవేమ' అన్నట్లు శ్రమ నన్ను ఉత్తేజితున్ని చేసేది. రాళ్ళపల్లి అనంతకృష్ణ శర్మ గారు ఆయన ఆరోగ్యం బాగా లేకపోతే చూడడానికి వెళ్ళాను. 'కొత్తగా ఏం చెప్పారు' అని అడిగితే 'నాకు ఒక ప్రాచీన ప్రతి దొరికింది' అని చెప్పాను ఆయన నాకొక ఉత్తర రాశాడు. "నీ క్రొత్త పరిశోధనలతో నా పాత భావములను మార్చగలరని వేడుచున్నాను" అని. ఆ ఉత్తరాన్ని ఆ బంగారు ఆభరణాన్ని దాచుకున్నట్లు పెట్టెలో దాచుకున్నాను. అది ఒక సర్టిపికెట్. ఆయన చాలా కూలంకశమైన వ్యక్తి. పైగా ఆయన బోలెడంత నేపథ్యం ఉన్నవాడు. ఆ శ్రమ నాకొక పునఃర్జన్మ నిచ్చినట్టు అనిపించింది. అన్నింటికంటె ముఖ్యంగా పారిస్ ప్రతి సంపాదించాను. లండన్ బ్రిటిష్ మ్యూజియం లైబ్రరీ నుండి బ్రౌన్ వేమన పద్యాల తొలి ముద్రణ ఇంకా వేయలేదు. ఈ పారీస్ ప్రతిని నవ తెలంగాణ వారు వేస్తున్నారు. దానిలో రిసెర్చ్ మెథడాలిజీ ఉంది.

**మృణాళిని : వేమన్న వెలుగులు కూడా ఉన్నాయి**

గోపి : వేమన్న వెలుగులు మూడేండ్లు సాక్షిలో సీరియల్ గా వచ్చాయి. చాలా ఆదరణ వచ్చింది. ఇప్పటి పిల్లలకు ఎక్కువ ఉపయోగం. నాకు పరిణతి కొంత పెరిగినట్టుంది. ఇప్పటకీ గోపిని వేమన వదలట్లేదు అని నారాయణరెడ్డి గారు అన్నారు. డిగ్రీ కోసమే ప్రవేశించినా వేమన నా జీవితంలో భాగమయ్యాడు.

**మృణాళిని :కవిత్వం దగ్గరకు వచ్చినట్లయితే <u>'తంగెడు పూలు, మైలు రాయి'</u> వరకు ఒక ఆత్మీయమైన ఆత్మాశ్రయమైన అనుభూతి స్పందన ఎక్కువ కనిపించాయని కొందరి భావన. తర్వాత <u>'చిత్రదీపాలు నుండి</u> <u>కాలాన్ని నిద్రపోనివ్వను'</u> వరకు తీసుకుంటే ఒక ఆ పరిణతి. ఒక సార్వజనినతకు వెళ్ళింది. వ్యక్తిగతం నుండి సార్వజనీనత వరకు వెళ్ళింది గోపి గారి కవిత్వం అని ఒక విమర్శకుడు అన్నాడు మీ గురించి. ఇట్లాంటి దశను గుర్తిస్తారా?**

గోపి : నా కవిత్వంలో మొదటి నుండి ఆత్మాశ్రయ దోరణి లేదు. సామాజికత ఎక్కువ. తంగెడు పూలు లో సౌందర్య దృష్టి ఉన్నా అది సామాజికమే. అన్ ప్రివిలైజ్డ్ గురించిన కవిత అది. వామపక్ష భావాల ప్రభావం కొంత ఉంది. అప్పుడు విరసం చాలా యాక్టివ్ గా ఉంది. అయితే నాది స్వతంత్ర దృక్పథం. అన్ని గాలులను తీసుకొని నాదైన పద్ధతిలో స్పందించటమనేది నా పద్ధతి అని నాకర్థమైంది.

**మృణాళిని :విరసం, అభ్యుదయం ఉద్యమం నుండి ఇప్పటి బహుజన ప్రాంతీయ ఉద్యమం వరకు కూడా అని ఉద్యమాల నేపథ్యంలో రాశారు.**

గోపి : అన్ని ఉద్యమాల్లో మంచి స్పందన ఉంటే నిజాయితి ఉంటే వాటిని నేను స్వీకరించాను

**మృణాళిని : కాని ఏదో ఒకదానికి ముడి పెట్టడానికి కుదరదు ?**

గోపి : కుదరదు. నాకట్లా ఇష్టం కూడా లేదు. ఇప్పుడు అంటే మార్క్సిస్టు భావజాలం అన్నాను గాని ఆర్గనైజేషన్ అని కాదు. ఆర్గనైజేషన్స్ లో నేను ఎప్పుడు సభ్యుణ్ని కాను. నాకు ఆ అగత్యం కలుగ లేదు.

**మృణాళిని : కాలాన్ని నిద్రపోనివ్వను మీకు సాహిత్య అకాడమి పురస్కారం లభించడమే కాదు కాలం కంటే మనిషి గొప్పవాడు అన్నారు. అలా అనడానికి చాలా ధైర్యం కావాలి మామూలుగా కాలమే గొప్పదే అంటాం. కాలాన్ని నిద్రపోనివ్వను అనే భావన ఎందుకు వచ్చింది.**

గోపి : మనుష్యులు మృత్యువుకు భయపడతారు కాలానికి చేతనయింది మృత్యువే కదా. లెక్క చేసేదేముంది. కాలాన్ని మనిషి జయిస్తాడు. నువ్వు 70 ఏండ్లు బతుకుతావు అని కాలం అంటే, దానికన్న ఎక్కువ రోజులు బతుకుతాను అని 90 ఏండ్లు బతికిచూపిస్తాను అనేక రూపాల్లో. శాశ్వతంగా పనిచేయటంతో కావచ్చు. మానవత్వాన్ని స్థాపించటంలో కావచ్చు. అదే దాని వెనుక ఉన్న అంతరార్థం.

**మృణాళిని: రాచపాలెం చంద్రశేఖర రెడ్డి గారు మీగురించి రాస్తూ మిమ్మల్ని ప్రపంచ కవి, జాతీయకవి, ప్రాంతీయకవి, అన్ని అన్నారు. అన్ని రకాల కవులు మీలోనే ఉన్నారు అన్నారు. మీరు ప్రత్యేకంగా ఏమైనా ప్రయత్నించారా ఆ స్థాయిల్లో ఏమన్నా చేద్దామని**

**గోపి :** ప్రయత్నించలేదు. నాప్రయాణంలో. మనం పల్లెటూళ్ళ నుండి వచ్చిన వాళ్ళం. హైదరాబాదు కొచ్చే సరికే మన ప్రపంచం విశాలం అవుతుంది. హైదరాబాద్ నుండి ఢిల్లి కి పోయే సరికి ఇంకా విశాలం అవుతుంది, భారతదేశం నుండి ఇంకా ముందుకు పోయే సరికి అనుభవం ఇంకా విశాలమౌతుంది. 'అది తక్కువ దేం కాదు'. ఆ రుచి మీకు కూడా తెలుసు. యూ హ్యావ్ వైడర్ ఎక్స్ పోజర్.

అక్కడి నుంచి మనుష్యుల అంతా ఇంతే, మట్టి అంతా ఇంతే, ఈ వైవిధ్యంలో ప్రత్యేకతను విశిష్టతను మనం చూస్తాం. నేను ఎక్కడికి పోయినా కూడా మనసుతో స్పందనతో చూస్తా. మీరొకసారి చమత్కారంగా గోపిగారు కవితాత్మంకంగా చూస్తారు అని అన్నారు. కవితాత్మంకంగా ఎమోషనల్ గానే కాక బ్రెయిన్‌తో కూడా చూస్తాను. ఎందుకంటే నేను ఎక్కువగా మనుష్యులని ప్రేమిస్తాను. ఆ దృష్టితో క్రమక్రమంగా నా పరిధి పెరిగింది. నా కవిత్వాన్ని చదివినప్పుడు <u>'ఈ కుర్రాడు ప్రపంచాన్ని ఎక్కువ అర్థం చేసుకుంటున్నాడే'</u> అనిపిస్తుంది. నాలో ఒక టీచర్ కూడా ఉన్నాడు కాబట్టి.


**మృణాళిని : అధ్యాపకులు నిరంతర కవిత్వం రాయడం అనేది నారాయణ రెడ్డి గారిలో చూశా. మళ్ళీ మీలోనే చూస్తున్నా. ఆపకుండా కవిత్వం రాయడం దానికీ దీనికీ ఏమైనా సంబంధం ఉందా.**


**గోపి :** ప్రవృత్తే. నేను కవిత్వం రాయకుండా ఉండలేను. మనిద్దరం సాహిత్య అకాడమిలో పని చేశాం కదా ఎన్ని సార్లు విమానం ఎక్కి ఉంటాం. రైళ్లో ఎన్నో సార్లు ఎక్కి ఉంటాం. నేను విమానం ఎక్కి కవిత రాయకుండా కిందికి దిగలేదు. మీకు కూడా ఎయిర్ పోర్టు లో వినిపించా. సో అది నా ప్రవృత్తి. <u>ఏదైనా కొత్తది రాగానే అయ్యో దీన్ని ఇట్లా చూడొచ్చా</u> దీన్ని. గతంలో పదేళ్లలో వంద కవితలు రాస్తే గత ఐదేళ్ళలో నాలుగు ఐదు వందలు రాశాను. కవిత్వంలోనే జీవించడం దానికి కారణం. నా ఇంటి వాతావరణం కూడా. నా శ్రీమతి అరుణ కూడా కవయిత్రి కూడా కావటం. ఆమె ఎనిమిది కవితా సంపుటాలు వేసింది. ఆమె నా తొలి శ్రోత. <u>ఆమె తొలి శ్రోత కాబట్టి తన అభిప్రాయం చెప్పడం.</u> ఇంట్లో తగిన వాతావరణం ఉంది.

**మృణాళిని : ఆమెకు కూడా మీరు తొలి శ్రోత కదా ?**


**గోపి :** అవును. ఆ నేను తొలి శ్రోతను. 'she is a belateal poet'. పిల్లలు అవి అయిన తర్వాత మొదలు పెట్టింది. ఆమె నాకు ప్రోత్సాహం, నేను ఆమెకు ప్రోత్సాహంగా ఉన్నాం.


(మిగతా వచ్చేవారం..)


















# "ప్రశంసనీయం-శ్రీశ్రీ నానీయం"




అనువాదం అనేది సామాన్యమైన ప్రక్రియ కాదు. ఆంగ్లం వస్తే చాలు అనువాదం చేయచ్చు అనుకోవడం కుదరదు. ఎందుకంటే ఆంగ్లంలో ఎంత ప్రావీణ్యం వున్నా అనువాదం చేయలేరు. మక్కీకి మక్కీ అనువాదం చేయడానికి ఆంగ్లంలో ప్రావీణ్యం వుంటే చాలు. కానీ భావాన్ని గ్రహించి అనువాదం చేయాలంటే మాత్రం ఆంగ్లంలోని పోకడలు తెలియాలి. భావవ్యక్తీకరణకు కవిత్వం వచ్చి తీరాలి. కవిత్వం అంటే ఏమిటో తెలియని వారు ఆనువాదం చేయలేరు. కవి తన వాక్యాలలో ఏమి చెబుతున్నారు? అతని భావాలలో అంతరార్థం ఏమిటి అనేది గ్రహించి చేసేదే అనువాదం. అనువాదమంటే మూలభాషలోని వస్తువును లక్ష్య భాషలోకి మార్చడం అనే నిర్వచనం అందరూ అంగీకరించేదే. అనగా వస్తువు మాటి మాటికి నూరుపాళ్ళూ మూల రచయితదే. అణుమాత్రం కూడా అనువాదకునిది కాదు. లక్ష్య భాష మాత్రమే అనువాదకునిది. అంటే అనువాదంలో కూడా లక్ష్యం ఉండి తీరాలనేదే దీని అంతరార్థం. ఎస్.ఆర్ పృథ్వి రచించిన నానీల రచనలో చెయ్యి తిరిగిన వారు. భావవ్యక్తీకరణలో నేర్పరులు. ముఖ్యంగా నానీల రచనపై చెయ్యి తిరిగిన కవి. గుండె ఊటలు చదివినా 'అన్నీ మన మధ్యనే' ఇప్పటి శ్రీశ్రీ నానీలు ఏది చదివినా వారి భావ సాంద్రత పటిష్ఠమైనది అని ఒప్పుకోవచ్చు ఉదాహరణకు ఇక్కడ నానీని గమనించండి ..

**"ఆకలేసి/ కేకలేసాడు/ సామాన్యుడి కళ్ళనిండా / కొరివి మంటలు"** ఇది మూలం. ఇందుకు అనువాదాన్ని గమనిస్తే "Being Hungry/ he shouted/ in common man tears/Touch flames అన్నారు. ఇది మక్కీకి మక్కీ అనువాదం. కానీ కవితాత్మను కవి ఆలోచనను గనక మనం గ్రహించగలిగితే ఎలా ఉంటుందో గమనించండి. "He cried/ in hunger/ reddish flames/in commener's eyes అంటాను నేను. అలాగే మరొకటి **"ఇప్పుడు/ బలవంతులెవరు/ చైతన్యం ముందు/ ఎవరూ నిలవరు"** అనే వాక్యానికి రమేష్ నారాయణ అనువాదాన్ని గమనించండి At present/ who are mighty/Before dynamism/None can with stand అన్నారు. కానీ నేను Who is/ strong now/who else can stand/ before a motivator అంటాను. ఇంత మాత్రం చేత రమేష్ నారాయణ గారికి అనువాదమే రాదని నేను అనటం లేదు. కథలు మక్కీకి మక్కీ అనువాదం చేసినా సరిపోతుంది. నవల కూడా అంతే.. ఎందుకంటే సంభాషణలు ఖచ్చితంగా ఉండాలి కనుక. కానీ కవిత్వాన్ని అనువాదం చేయాలంటే ఆత్మ ఎరిగి ఉండాలని మాత్రం అంటాను. అంతే ..! కానీ ప్రయత్నం మంచిది.. మహాకవి శ్రీశ్రీ గారిని మననం చేసుకోవడం అంటే కవి మేధస్సుకు పునరుజ్జీవనం కలిగించినట్లే..

ఒకానొక సమావేశంలో డా॥ ఎన్ గోపీగారు అన్నారు. నానీ ఎదురుగా అనువాదం చేయకండి. ఎందుకంటే అందరూ అక్కడి కవిత్వాన్ని చదవటం మానేసి ఈ లైన్‌కు అనువాదం ఎలా చేసారో అని గమనిస్తుంటారు. తద్వారా కవిత్వం మరుగవుతుంది అని.. ఎందుకో ఈ పుస్తకాన్ని తిరగేస్తుంటే ఆ మాట గుర్తుకు వచ్చింది. అలాగే.. పృథ్వి గారి కొన్ని నానీలలో శ్రీశ్రీ వ్యక్తిత్వం, కవిత్వాన్ని తెలియజేసే ఈ నానీలు రావడం అవసరం కూడా .. ఉదాహరణకు

**"ద్రోణుడికి/ ఒక్కడే ఏకలవ్యుడు/ శ్రీశ్రీకి / వందలు వేలు"**


**"నక్షత్రాలు /అదిరి చూసాయి/ అవును/ అక్షరాలా మజాకా!"**

**"జగన్నాథ చక్రాలు/ భూమార్గం పట్టాయి/ పీడిత జనాలు/ హారతి పట్టాయి"**

ఇలాంటివి అనేకం. ప్రతి నానీ చదవతగినదే. గాఢత కోల్పోకుండా రచించిన వీరి తీరు కడు ప్రశంసనీయం. పృథ్విగారి కలం నుండి మరిన్ని రచనలు రావాలని కోరుకుంటూ అభినందిస్తున్నాను.

ప్రతులకు :శ్రీమతి పి.ఉషారాణి
ఫోన్: 0883-2421123
వెల:60/-

# సంక్లిష్టతరమైన పదప్రయోగ సూచిక





పాల్కురికి సోమనాథుని రచన బసవ పురాణము తెలుగు సాహితీ లోకంలో తెలియని వారు లేరంటే అతిశయోక్తి కాదు. ఈ గ్రంథం సరికొత్త పంథాలో నడిచింది. పాల్కురికి తన బసవ పురాణంలో వాడిన పదాలను, వాటి అర్థాలను, సంస్కృత సమాసాలను యథాతథంగా సమాసమంతా ఒకే పదంగా చూపించడం విశేషం. సోమనాథుని సంస్కృత సమాస కల్పనా చాతుర్యాన్ని యథాతథంగా చూపించాలని చేసిన వీరి ప్రయత్నం ప్రశంసనీయం. సాహిత్య లోకంలో ప్రస్తుత అశక్తులు విచిత్రంగా తయారయ్యాయి. అయినా కరీంనగరం పట్టణంలో సాహితీ శ్రేయోభిలాషులు కొందరు ఒకచోట చేరి పాల్కురికి సోమనాథుడు రచించిన "బసవ పురాణాన్ని' సూచికా నిర్మాణార్థం పరిశీలించారు. వాస్తవంగా ఇది పదప్రయోగ సూచికా నిర్మాణం కొత్తగా ఉంది. పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం వారు ప్రచురించిన బసవ పురాణ గ్రంథాన్ని తీసుకుని, ఒకరినొకరు ఎంతో సహకరించుకుంటూ సాగించిన ఈ విధానం ఎంతో హర్షణీయమైనది. సోమనాథుని సంస్కృత సమాస కల్పనా చాతుర్యాన్ని ఉన్నది ఉన్నట్లుగా చూపించాలనే ప్రయత్నం చేసారు.

ఈ పదాంతాల్లో అంకెలూ, సంఖ్యలూ ఆశ్వాసాలనూ, ఆ ఆశ్వాసాల్లోని పాద సంఖ్యనూ తెలిపాయి. బ్రాకెట్లలోని సంఖ్య ఆయా పదాల ఎన్ని సార్లు ప్రయోగించబడుతుందో తెలుపుతుంది. విశ్వవిద్యాలయం ప్రచురించబడిన పాల్కురికి సోమనాథుని బసవ పురాణంలో నిజానికి పాద సంఖ్యలు లేవు. ఈ రచించిన వారే పాదాలకు అంకెలూ, సంఖ్యలూ వేసుకుని సూచికగా అమర్చారని తెలిపారు. అలాగని పాఠకులు బసవ పురాణ ఆశ్వాసాల్లోని పాద సంఖ్యను లెక్క పెట్టుకుని చూసుకుంటే తప్ప వీరు సూచికలో చూపించిన పదం దొరికే అవకాశం లేదు. ఒక రకంగా పాఠకునికి మెదడుకు మేత పెట్టారని తెలపడం బావుంది.

కానీ ఈ పద ప్రయోగం ఎలా చేసారు? దేన్ని సూచికగా చేసుకున్నారు? ఎలా ఆ సంఖ్యల్ని వేశారు? మొదటిది ఆత్రర్యాది లింగ ప్రసాదంబు 7-1115 అన్నారు అంటే 1115 పేజీలో ఈ పదాన్ని ఏడుసార్లు ఉపయోగించారనా? తెలియటం లేదు. నిజానికి ఈ గ్రంథం నాకొక పజిల్ లాగా అనిపిస్తోంది. ఈ రచన చేసిన వారు ఆ సంఖ్యల్ని వివరించాలి. ఒట్టి పద ప్రయోగ సూచిక అంటే ఆయా పేజీలలో ఆయా సంబంధింత పదాన్ని అన్ని సార్లు ఉపయోగించారని తెలిపారని మాత్రం నాకు అర్థమవుతోంది. అవును అని ఒప్పుకోవడానికి బసవ పురాణం చదవాలి. రెంటినీ బేరీజు వేసుకోవాలి. అసలు బసవ పురాణం ఎన్ని పేజీలు? ఇందులోని పెద్ద సంఖ్యలు ఏమిటి? చిన్న సంఖ్యలు ఏమిటి? అనేవి గమనించుకోవాలి. ఎంతో ప్రయోగాత్మకమైన ఈ గ్రంథం ప్రతి ఒక్కరూ చూడాలి. ఎందుకంటే చదవడానికి ఇక్కడేమీ లేదు. బసవ పురాణాన్ని ముందు పెట్టుకుని సంవత్సరాల తరబడి పోల్చి చూసుకోవడమే.. ఆ ప్రయోగానికి అభినందనలు

ప్రతులకు: కరీంనగర్ సాహితి
ఫోన్: 9704374081. వెల: 250/-




# జామ తోట మాలి

ప్రతి వ్యక్తీ, ఈ అనంత జన ప్రవాహంలో 'సమూహంలో ఒకడు'గా జీవిస్తున్నవాడే!

ప్రతివ్యక్తీ, రోజూ ఏవేవో కొత్త అనుభవాల్ని ప్రోవు చేసుకుంటున్నవాడే!

ప్రతివ్యక్తీ, బ్రతుకుబడిలో పాఠాలు నేర్చుకుంటున్న విద్యార్థే!

ఆ వ్యక్తిని ఆవరించుకుని తల్లిదండ్రులు, బంధువులు, స్నేహితులు, సహాధ్యాయిలు, ఉపాధ్యాయులు, ఉద్యోగంలో చేరాక పై అధికారి, సహ ఉద్యోగి, సబార్డినేటులు, ఆ సంస్థతో లావాదేవీలు నడిపే వ్యక్తులు, సంస్థల ప్రతినిధులు, ఇంటిచుట్టూ ఉన్న ఇరుగు పొరుగూ, రోజూ 'వాకింగ్'లో కనబడే పరిచయస్తులు ఇలా వీళ్ళందరితోనూ అనుభవాల్ని ప్రోవుకుంటున్నాడు.

ప్రతీ అనుభవం- తనది కావచ్చు లేదా ప్రక్కవారిది కావొచ్చు- లోంచి పాఠాలు నేర్చుకుంటూ ముందుకు సాగటంలోనే విజ్ఞత ఉంది. ఏడున్నర దశకాల కూర చిదబంరం జీవితంలో ఎదురైన అనుభవాలు, వాటిలోంచి నేర్చుకోగలిగే పాఠాలే ఈ "అనుభవాలు-పాఠాలు"-!

– సంపాదకులు

ఈ ప్రపంచంలో మంచితనం ఇంకా బ్రతికే ఉంది. మనిషికి, మనిషికి మధ్య మంచితనం అనే 'వారధి' ఇంకా అలాగే ఉంది.

ఎదుటివారిని మనం మోసం చేయాలని ప్రయత్నించినప్పుడు, ఆ ఎదుటివారు విషయం తెలిసి కూడా మనల్ని మందలించకపోవడం, పైగా ఆ మోసానికి బలియై పోయినట్లు నటించి మనకు క్షణికానందం కల్పించటం, వారి మంచితనం తప్ప మరోటికాదు. బాల్యంలోని సరదాలు, ఆ సరదాల్లో భాగంగా ఎదుటివారిని మోసం చెయ్యటం, చదువు, సంధ్యాలేని ఆ ఎదుటివారి విజ్ఞత, ఉదాత్తతకు నేడు చేతులెత్తి మొక్కాలనిపిస్తుంది. అవి నేను స్కూలుకు వెళుతున్న రోజులు. మా ఊరికి పడమటి వేపు, సరిహద్దులా పోలీస్ స్టేషన్, స్టేషన్ వెనకాల జామతోట ఉండేది. భీమేశ్వరాలయం ఎదురుగా ఉన్న మా స్కూలుకు ఆటస్థలం అంటూ లేదు. కొన్నాళ్ళకు పోలీస్ స్టేషన్‌కు అవతలవేపు కొంత స్థలం ఆటస్థలంగా కేటాయించారు. వారంలో రెండురోజులు అక్కడ మాకు పి.టి. (ఫిజికల్ ట్రైనింగ్) ఉండేది.

జామపళ్ళ కాలంలో మేం ఆ ప్లే గ్రౌండ్‌కు వెళ్తూ దోవలో జామతోట దగ్గర ఆగి జామపళ్ళు కొనుక్కునేవారం. అప్పటికింకా కిలో మారకం రాలేదు. తక్కెడ, అరతక్కెడ, సవాసేరు తూకాలు ఉండేవి. తక్కెడ జాంపళ్ళకు డబ్బులు చెల్లించి 2 తక్కెళ్ళ వరకు బెల్లించుకునేవాళ్ళం.

అదెలాగో చెబుతాను. నలుగురం అయి దుగురం ఓ జట్టుగా వెళ్ళి "మాకు చెట్టుమీది పళ్ళు కావాలి" అని తోటలోకి నడిచేవాళ్ళం. మా లో ఒకడు ముందుండి ఏ పండు, ఏ చెట్టు మీంచి కోయాలో చెప్పేవాడు. వాడి వెనకాల గంపతో తోటమాలి; తోటమాలి వెనక మిగతా ముగ్గురు నలుగురం మేము నడిచేవారం.

మాలో ముందున్నవాడు "ఇదుగో ఈ పండు కొయ్. ఇది. ఇది కాదు. అది" అంటూ సూచనలు ఇస్తాడు. పండు కోయటానికి మాలీ దృష్టి చెట్టుమీద ఉన్నప్పుడు మాలీ వెనుక ఉన్నవారు తలా ఒకటీ రెండు పళ్ళు కోయటం, గబుక్కున మింగటం!మేం సెలెక్ట్ చేసి కోయించిన పళ్ళను గేటు 'బయట' తూకం వేపించి తలా ఒకటీ రెండు పంచుకుని రోడ్డెక్కేవారం.

ఒక 'తక్కెడ' (కిలోన్నర) పళ్ళు అర్ధ రూపాయి ధర. తలా ఓ అణా వేసుకుని తక్కెడ పళ్ళు, ప్లస్ గబగబా తిన్నన్ని... వెరసి, రెండు తక్కెళ్ళ పళ్ళు గిట్టుబాటు అయ్యేవి. అలా మోసం చేయటం మాకు తప్పు అనిపించేది కాదు. అదో సరదా. అంతే.

మా ఆటస్థలం మొదట్లో రోడ్డుకు దగ్గరగా ఓ చేదబావి ఉండేది. విద్యార్థులం మేమూ, దారినపోయేవాళ్ళు, ఆ బావి దగ్గర ఆగి దప్పిక తీర్చుకుని, బావి ప్రక్కనే కొమ్మలు విస్తరించుకున్న ఓ తుమ్మచెట్టు నీడలో కాసేపు ఆగి సేద దీరేవారు.

ఒకరోజు ఆటల అనంతరం దప్పిక వేసింది. బావివేపు నడిచాను. జామ తోట మాలీ, తుమ్మచెట్టు నీడక్రింద సేద దీరుతూ కనిపించాడు. పరిచయ పూర్వకంగా ఓ నవ్వు పడేసి బావిలో బొక్కెన వేసాను. అలిసిపోవటంవల్ల కావొచ్చు, నీటితో నిండి ఉన్న బొక్కెన బరువు అనిపించింది. కష్టం మీద పైకి లాగుతున్నాను. నీళ్ళతో నిండిన బొక్కెన పైకి వచ్చింది కానీ నాకు అందటంలేదు. కాలి బొటనవేళ్ళమీద నించుని బ్యాలన్స్ చేస్తూ, బొక్కెనని అందుకో ప్రయత్నిస్తున్నాను. బావి వేపు వంగాను. బొక్కెన అందలేదు సరికదా. ఎత్తు తక్కువ ఉన్న ఆ బావిలోకి నేనే పడినంత పనయింది.

ప్రక్కనే ఉన్న మాలి గభాలున్న వచ్చి నా చేతిలోని చేదను అందుకుని బావి గోడమీద ఉంచాడు. ఇక దాహం తీర్చుకో అన్నట్లుగా నావైపు చూసాడు. గొప్ప ప్రమాదం నుండి తప్పించిన ఆ మాలిపైన సింపతీ పెరిగింది. ఏదో రకంగా నాచేతనైన సాయం చేయాలనిపించింది.


నా తరువాత ఆ మాలి నీళ్ళు చేదుకుని కడుపునిండా నీళ్ళు తాగి తుమ్మచెట్టు మొదట్లో కూర్చుని, చుట్ట అంటించుకోవటానికి 'చెకుముకి' కొట్టి రెండు పీల్పులు పీలుస్తున్నాడు.

తడిచిన అంగీ (షర్ట్) కొసలు పిండుకుంటూ ఆయన్ని సమీపించాను. మేము చేసే కోతి పనులు మాలీకి వివరించాను. ఆయనకు జరుగుతున్న నష్టం ఇకముందైనా ఆయన పూడ్చుకోవాలని నా ఉద్దేశ్యం.

మాలీ ఇచ్చిన జవాబు నన్ను చకితుడ్ని చేసింది.

"పూసిన పూతంతా, కాయై నిలువదు, కాసిన కాయంతా, పండు పండదు. పండిన పండ్లన్నీ ఇళ్ళు చేరవు. ఎలుకలు, చిలుకలు, కోతుల చేయిపడితేనే, పంటకు 'బర్కతు' (సంక్షేమం) ఉంటుంది. ఎలుకలు, చిలుకలు, కోతుల్లాంటి మీ చేతులు పడితేనే మంచిగుంటది. మీరు అలా దొంగతనంగా తింటున్నారని నాకు తెలుసునయ్యా! గేటు దగ్గర్నుంచి మా ఇంటిది ఇదంతా గమనిస్తూనే ఉంది. ఓసారి రెండుసార్లు మిమ్మల్ని తోటలోకి రానివ్వద్దని నాతో అంది కూడా". కాసేపాగి "అయినా ఎన్ని తింటారయ్యా? మరో తక్కెడు. అంతేనా... అందుకనే.. అందరికి గేటు దగ్గర చారానా చొప్పున అమ్మితే... మీకు ఆఠానా చెబుతున్నాను. నాకూ నష్టంలేదు. మీకూ చెట్టుమీది కాయలు బరుక్కున్న 'తృప్తి' " అన్నాడు.

ఏ అర్థికశాస్త్రం, సైకాలజీ, మానవ సంబంధ శాస్త్రాలు చదవని ఆ మాలి విశ్లేషణ జ్ఞప్తికి వచ్చినప్పుడెల్లా మనసులోనే మాలికి జోహార్లు అర్పిస్తూ ఉంటాను.



-కూర చిదంబరం
సెల్: 8639338675

పుస్తక సమీక్షలు




# అనేక ప్రశ్నలకు సమాధానం "ఇదే నా వేదభూమి"

నేడు ఉన్నదంతా సంఘర్షణే. తనవైన వాటికోసం, వేరొకరి కోసం నిత్యం సంఘర్షణే. నిరంతరం ఈ సంఘర్షణ దేనికోసం? అంటే ఒక్క నిముషం ఎవరికీ అంతుచిక్కదు. ఎందుకంటే దేనికోసమో ఎవరికీ తెలియదు. అయినా ఏదో ఆరాటం, ఏదో పోరాటం. కొన్ని శతాబ్దాలుగా అణచివేయబడి వున్న భారతీయ సంస్కృతి ఇపుడు విదేశీయులచే ఆదరించబడుతున్నది. ఐదువేల సంవత్సరముల నాటి ద్వార సముద్ర గర్భమున దర్శనమిచ్చినది. రామసేతువు గుర్తించబడివున్నది, ఇవన్నీ ప్రాచీన భారతీయ సంస్కృతి పట్ల పాశ్చాత్య విద్యన భ్యసించిన భారతీయ విజ్ఞులలో కూడా ఆదరాభిమానములు కలుగుటకు కారణమగుట సముచితమే కదా అనిపిస్తుంది. ఈ రచయితకు భారతీయ సంస్కృతి పట్ల గౌరవం ఉంది. ఆంగ్ల విద్య వంతులకు కూడా భారతీయ సంస్కృతి పట్ల ఆదరాభిమానములు వృద్ధి చెందుట కొందరికి కష్టంగా అనిపిస్తుంది. కనుక వారు దానిపై బురద జల్లుటకు చేసే ప్రయత్నములు నిత్యం మనం గమనిస్తూనే ఉన్నాము. చర్చల పేరిట అసంబద్ధమైన ఆరోపణలు చేయుటకు పోటీపడుట కనిపిస్తున్నది. దానిని సహించలేక తగు సమాధానములు ఇచ్చుటకు చేసే ప్రయత్నమే ఈ గ్రంథం ఆంతర్యం.

మనసున్నవాడే మనిషి. మనసున్న వాడికే ఊహలు, ఆశలు, ఆశయాలు, అత్యాశలు, కోరికలు, అన్నీ. కానీ ఈ ఊహే నేడు మనిషిని మరమనిషిని చేసి ఆడిస్తున్నది. ఆశ ఉంటే నమమే. కానీ అత్యాశ ఉంటే ప్రమాదం. అసలు మనిషి తనకేం కావాలో తెలుసుకోవడానికి ఒక జీవిత కాలం సరిపోదు. తీరా తెలిసే సరికి జీవితం ముగిసిపోతుంది. ముఖ్యంగా భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు అంతరించిపోయే దశకు చేరుతున్నాయి. వాటిని నిలబెట్టే ప్రయత్నం చేయకపోవడం, ఐక్యమత్యం లేకపోవడం, ఒకరిపై ఒకరికి నమ్మకం లేకపోవడం లాంటివి కూడా మన సంస్కృతిని దెబ్బతీసే కారణాలే. కులదూషణ, మత దూషణ లాంటివి కేవలం పనిలేని వారు చేసే కుతంత్రాలు తప్ప మరేమీ కాదు. మన దేశం భారతదేశం. కులాలకతీతంగా, మతాలకు అతీతంగా సాగిపోయే అద్భుతమైన దేశం. ఇందు జనాభాలో అందరూ సమిష్టిగా మన మతాలను కులాలను ఒక్కటిగా చేసుకుంటూ ముందుకు నడవాలి తప్ప నీవు తక్కువ, నేను ఎక్కువ అనే భావాలను కనిపించనీయకూడదు. అదే ఈ గ్రంథంలోని ముఖ్యాంశము.

ధర్మం ఎవరికైనా ఒకటే. నీతి, నిజాయితీ అన్నీ ఒకటే. కానీ ఒక్కో సంప్రదాయానికీ ఒక ధర్మం అంటూ ఎక్కడా ఉండదు. రాజకీయ స్వప్రయోజనాల కోసం ఇవన్నీ సృష్టించబడినవి తప్ప తనకుతానై తయారు చేయబడినవి కానే కాదు. ఈ రచయిత ఎంతో ఆశాజీవి. ప్రస్తుతం భారత దేశంలో ఏవి అవసరం? ఏది కోల్పోతున్నాము అనే విషయాలను వివరించే ప్రయత్నం ఈ గ్రంథంలో చేసినందుకు అభినందనలు.

ప్రతులకు: శ్రీ హరి నివాసము,
మోతీ నగర్, ఫోన్ : 98854 22354
వెల్ 100/-

సమీక్షకులు -శైలజామిత్ర
9290900879

# ప్రాణాధారమైన నది

అటు ఇటు చూస్తు ప్రవహించేది
రాళ్ళను రప్పలను దాటి ప్రవహించేది
ఊరి పొలిమేరలో ప్రవహించేది
మన దప్పికను తొలగించేది
ప్రజలందరిని ఆకట్టుకునేది
శుభ్రమైన నీటిని కలిగినది
అన్ని జీవరాసులను రక్షించేది
స్వచ్ఛత గాలిని అందించేది
పచ్చని పైరులకు సాయపడేది
ఆ సాయం లేకపోతే లేదు మన దేశం
నీటి వల్ల మనసుకి హర్షం
నీరు మనకి ఎంతో నేస్తం
నీరు తొలగిస్తుంది విచారం
నీరు తొలగిస్తుంది కాలుష్యం
నీరు మనకి జీవనం
ప్రపంచం చెప్తుంది మండే మా శక్తిని
ఆ ప్రాణధరియే మన నది.



– యస్. హారీష
9వ తరగతి
జడ్.పి.హెచ్.ఎస్. కాగజ్‌మదుర్
నర్సపూర్ (మం), మెదక్ (జిల్లా)



## నేటినిజం

**చందా వివరాలు**

ప్రతి వారం ప్రచురిస్తున్న 'సాహితీ కెరటాలు' గల 'నేటినిజం' 260 సంచికలు + పోస్టల్ ఛార్జీలు కలుపు కుని 5 సం॥రాలకు రూ.700/-, 10 సం॥రాలకు రూ 1200/- మీ చందాను 'నేటినిజం' తెలుగు దినపత్రిక పేరిట ఎం.ఓ. లేదా డిడిగానీ, ఈ క్రింది అడ్రసుకు పంపగలరు.

'నేటినిజం' దినపత్రిక, ఎస్ఆర్‌టి-74,
జవహర్‌నగర్,
హైదరాబాద్-500 020.


# చైతన్య ప్రబోధాలు కాళోజీ రామేశ్వరరావు అనువాదాలు




కాళోజీ రామేశ్వరరావు అనే పేరు తెలియని వారు తెలుగు సాహిత్యంలో ఉండరనే చెప్పాలి. కాకుంటే వీరు కాళోజీ నారాయణరావు గారి అన్నగారని కొందరికే తెలిసి వుంటుంది. వీరు తెలుగు భాషలో మహా పండితులు. అంతే కాకుండా అనేక భాషల్ని అవపోసన పట్టిన కవులు. ఉర్దూ, హిందీ, ఆంగ్ల భాషల్లో కూడా ప్రావీణ్యం గడించారు. ఎందరో స్వాతంత్ర సమరయోధులకు, కవులకు, పండితులకు ప్రోత్సాహం అందించారు. స్వయంగా పోరాటయోధులు. షాదు అని ఆయనను అనుయాయులు, సమకాలీకులు ఆత్మీయంగా పిలుచుకునేవారు. కాళోజీ నారాయణరావు ప్రజాకవిగా ఎదగడానికి రామేశ్వరరావుగారి చైతన్య ప్రబోధం, సాహిత్య ప్రభావం ఎంతగానో దోహదపడింది. వీరు తెలుగులో అనేక గేయాలను రచించారు. వీటిని 'భావగద్య'లని కొత్తపేరుతో పిలిచారు. ఉర్దూ ముషాయిరాల్లో కూడా పాల్గొనేవారు. స్వయంగా నిర్వహించేవారు. ఉర్దూలో మంచి కవిత్వం రాసేవారు. ఎక్కువగా ఉర్దూలో రచించే వీరి తెలుగు కవిత్వంలో కూడా తెలుగు ప్రభావం కనిపిస్తుంది.

కాళోజీ నారాయణరావుగారిని తీర్చిదిద్దిన మహా శిల్పి రామేశ్వరరావు. నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా సాగిన తెలంగాణా విముక్తి పోరాటంలో కాళోజీ సోదరులు నిర్వహించిన పాత్ర అమోఘమైనది. ఆదర్శవంతమైనది. ఎన్నో కష్టనష్టాలకు గురైనా కూడా రామేశ్వరరావు నారాయణరావు గారిని ప్రజలకు అంకితం చేసారు. అందుకే నారాయణరావు గారు ఇప్పటికీ ప్రజల మనిషిగా ప్రజల గొడవ తన గొడవగా గొంతెత్తి వినబడుతున్నారు. అక్రమాలను నిరసిస్తూ ఆక్రోశిస్తున్నారు. ప్రజల్ని చైతన్యవంతం చేస్తున్నారు. వీరొక ఉగ్ర నరసింహమూర్తి. వీరగంధం పూసుకున్న విప్లవ కవి. ప్రజాకవి.

రామేశ్వరరావు గారు సంఘసేవకులుగా, సాహిత్య సమారాధకులుగా, స్వాతంత్రోద్యమ స్ఫూర్తిదాయకులుగా కవిగా, ఉర్దూసాహిత్య నిర్మాతగా దేశానికి సుపరిచితులు, ఇదివరకే రెండు సంపుటాల ద్వారా వీరి ఉర్దూ కవితలు ప్రచురింపబడి పండితుల మన్ననల్ని పొందారు. ఉర్దూ సాహిత్య రంగంలో వీరికి ప్రత్యేకమైన స్థానమున్నది. 'షాద్' గా ప్రముఖమైన గుర్తింపు ఉన్నది. ఉర్దూ సాహిత్య పాఠకులు వీరి కవిత్వాన్ని ఎంతో ఆరాధిస్తుంటారు. రామేశ్వరరావుగారు ఎన్నో రచనలు చేసినా ఇంతవరకు శ్రీ పి. రామగోపాలరావు, శ్రీ టి. ప్రకాశరావు గార్ల ప్రోత్సాహంతో ఉర్దూ రచనల సంపుటి కూడా వారి సహాయంతోనే వెలువడుతున్నందుకు ఆనందంగా ఉంది. ముందుముందు హిందీ, ఆంగ్ల కవితా సంపుటిలు కూడా విడుదల కావాలని కోరుకుందాం. ఈ సంపుటిలో కొన్ని తెలుగు కవితలు, మరికొన్ని ఉర్దూ రచనల నుండి తెలుగు అనువాదాలు ఉన్నాయి. ఉదాహరణకు **"ఎన్నికల వేళ వా/డెంత గొప్పోడు/ ఓటున్న ప్రతి పౌరు/డొక చక్రవర్తి/ఏ క్షణము గడిచెనా/అన్నార్తివాడు/తన దేశమున తానె /శరణార్థివాడు/ తానోడు-నేతలను/ గెలిపించు ఘనత/ అదియె మన గణతంత్ర ఘనత"** అనేది ఉర్దూ నుండి దేవులపల్లి సుదర్శనరావు గారు అనువదించడం బావుంది. వీరి కవితా శైలి ఎంతో ఉన్నతంగా ఉంది. ముఖ్యంగా నేటి పాఠకులకు కాళోజీ రామేశ్వరరావు రచనల పరిచయం చేయాలని తెలంగాణ సాహిత్య అకాడమి తీసుకున్న ఈ నిర్ణయం బహు ప్రశంసనీయం.

ప్రతులకు : తెలంగాణ
సాహిత్య అకాడమి కార్యాలయం,
ఫోన్: 040-29703142
వెల: 25/-

# కవిత్వ తీరంలో "విరమించని వాక్యం"




దాసరాజు రామారావు కవిత్వం తెలుగు పాఠక లోకానికి సుపరిచితమే.. వర్ణన, వస్తువు రెండూ ఒక ఒరలో అమర్చగల దిట్ట వీరు. వాస్తవానికి కవులు ఎక్కువై కవిత్వం కొరవడుతున్న ఈ రోజుల్లో ఒకటీ, అరా అక్కడక్కడా మినుకు మినుకుమనే కవిత్వం తెలుగు సాహిత్యాన్ని సేదదీర్చుతూనే ఉంది..అలా సేదదీర్చే కవిత్వ తీరం ఈ "విరమించని వాక్యం". 54 కవితలతో, వివిధ అంశాలను వివరిస్తూ, ఎక్కడా కవిత్వ ఛాయలు పోకుండా ప్రయత్నం జరిగిందంటే నమ్మాల్సిందే. అందుకే వీరంటారు **"ఒక ఊహ/ ఒక స్పృహ/ ఒక రహస్యానంతర జిలుగు/ ఒకానొక మైమరపించే మేల్కొలుపు/ కవిత్వం"** అని. **అలాగే అక్షరం..కాలం.. మనిషి/ చెట్టాపట్టాలేసు కుని నడిచే/ సహ జీవన దృశ్యం/ నేను గెలుచుకునే కల"** ఇవీ ఈ సంపుటి ఆంతర్యం. ముందు మాట లేకపోవడం, శీర్షికపై కవిత్వం లేకపోవటం ఈ గ్రంథ ప్రత్యేకతలు.

కవిత్వంమంటే వంద వాక్యాల సమూహం కాదు. వంద అర్థాల ఏక వాక్యం. కవిత్వమంటే వందపేజీల వచనం కాదు. వంద భావాల సమాహారం అనడానికి ఉదాహరణ ఈ వాక్యాలను గమనించండి **"అణగదొక్కిన చరిత్ర కిపుడు పట్టాభిషేకం/ పురిటి గండాల నీది/ బాలారిష్టాల తట్టుకొని/యవ్వనద్రేక ప్రమాదాల దాటుకొని/ పళ్ళూడే షష్ట్యాదశమాంకపు జీవితాన/ కల ఇంటికి చేరిన వేళకి/ దండం/ బక్క ప్రాణానికీ/ భారీ లక్ష్యానికీ/ అరవై ఏళ్ళ దూరం"** అంటారు వీరి "జననీ జయకేతనం" కవితలో.. ఈ వాక్యాల్లో ఎంత లోతైన భావన ఉందో అనిపించక మానదు. మరోచోట "ప్రశ్న.. ప్రశ్న గనే" అనే కవితలో **"గుడిసెను తడిపిన వాన/ మహల్లో కురిసిన వెన్నెల/ పోలిక కుదర్చ లేక/ కవి మనసు తంటాలు పడుతుంటది/ ప్రశ్న ఫక్కున నవ్వి /బేతాళుని వలె/ జీవితమంతా పరిహసి స్తూనే వుంటది"** అంటూ ఎప్పటికయినా ప్రశ్నలకు సరైన సమాధానాలు లేవు అని తెలిపే ఈ కవిత ఆలోచింపజేస్తుంది.

ఇలాగే అమ్మ సంతకం, దృశ్యభ్రమణ లోంచి, మృత్యుగానం, యుద్ధవాంఛ, కవి జన్మ, తడి గీతాల వాడు, తెలంగాణీయత, లాంటి కవితలూ వైరుధ్యమైన ఎత్తుగడ, ముగింపులో కొత్తదనం కనిపించేలా రచించారు. పుట్టింటినుండి కన్న కూతురు వెళ్ళిపోతుంటే తల్లి కన్నీళ్ళే వీడ్కోలు చెబుతాయి. కానీ తండ్రి బాధ కనిపించదు. అలా కనిపించని ఆ బాధ తాలూకు మనసును ఎంతో అద్భుతంగా వ్యక్తీకరించిన కవిత "అమ్మాయి వెళుతోంది" **"నా ఇంటిని నా ఇష్టానికే వదిలేసి/ సర్దిన తీరులో తన ఇష్టాన్ని ముద్దరేసి/ కాలానికి నా ఎదురుచూపు లానించి/ అమ్మాయి వెళుతోంది అంటూ** మొదలు పెట్టి **"పెళ్ళి రోజున/ నా ఇంటి గడప కడిగి/ కని పెంచిన ఋణం తీర్చుకుని/ అమ్మాయి వెళుతోంది/ ఋణాలను తీర్చు కోవచ్చు/ ప్రేమలను తీర్చుకోవడముం టుందా?"** అనడంలో ఎంతో ఆర్ద్రత కనిపిస్తుంది. మంచి కవిత్వాన్ని అందించిన ఈ కవికి అభినందనలు..

ప్రతులకు : డి. విజయలక్ష్మి,
ఫోన్: 96182 24503, వెల:60/-

## నేటి నిజాలు



